వాయిస్ ఆఫ్ ప్రజలు
# వాయిస్ టుడే
VOICE OF PRAJALU
TGTEL/25/A2649
తెలుగు దినపత్రిక
www.Voicetodaynews.com
https://epaper.voicetodaynews.com
జనగాత్రం - మననేత్రం
Follow
పేజీలు 10
సోమవారం, ఫిబ్రవరి 23, 2026
HYDERABAD RANGAREDDY NALGONDA MAHABOOBNAGAR MEDAK KHAMMAM KARIMNAGAR WARANGAL NIZAMBAD ADILABAD

## దేశంలోనే వేగవంతమైన మెట్రో... మీరట్‌లో ప్రారంభించిన ప్రధాని మోదీ




దేశంలోనే అత్యంత వేగవంతమైన మెట్రో సేవలు ఉత్తరప్రదేశ్‌లోని మీరట్‌లో ప్రారంభమయ్యాయి. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆదివారం ఈ సర్వీసులను లాంఛనంగా ప్రారంభించి జాతికి అంకితం చేశారు. అనంతరం శతాబ్ది నగర్ స్టేషన్ నుంచి మీరట్ సౌత్ స్టేషన్ వరకు ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌తో కలిసి మెట్రోలో ప్రయాణించారు. ఈ మెట్రో గంటకు గరిష్ఠంగా 120 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తుంది. ఈ మీరట్ మెట్రో దేశంలోనే అతి వేగవంతమైన మెట్రో వ్యవస్థగా నిలిచింది. మీరట్ మెట్రో సేవలు ఆదివారం సాయంత్రం 6 గంటల నుంచి ప్రజలకు అందుబాటులోకి రానున్నాయి. ఈ ఆధునిక రవాణా వ్యవస్థతో నగరంలో ట్రాఫిక్ సమస్యలు తగ్గి ప్రజలకు సౌకర్యం కలుగుతుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు.

తెలంగాణలో కీలక నిర్ణయాల దిశగా

# నేటి మంత్రివర్గ భేటీ

### బడ్జెట్ సమావేశాల తేదీలపై స్పష్టతకు అవకాశం.. హైదరాబాద్ మెట్రో టేకోవర్‌పై కీలక చర్చ

### ఎన్నికల షెడ్యూల్, రైతు భరోసాపై నిర్ణయాల సూచనలు.. కేంద్ర నిధుల సాధనపై అధికారులకు మార్గదర్శకం

### ఉద్యోగులు, పెన్షనర్ల బకాయిల అంశం కూడా ఎజెండాలో పలు ఆర్డినెన్స్‌లకు ఆమోదం లభించే వీలుంది




హైదరాబాద్ : రాష్ట్రంలో పాలనాపరమైన కీలక అంశాలపై నిర్ణయాలు తీసుకునే దిశగా నేడు మంత్రివర్గం సమావేశం కానుంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు సచివాలయంలో కేబినెట్ భేటీ జరగనుంది. ఈ సమావేశంలో ముఖ్యంగా శాసనసభ బడ్జెట్ సమావేశాల తేదీలను ఖరారు చేయడం ప్రధాన ఎజెండాగా ఉండనుండగా, ఇతర పరిపాలనా, ఆర్థిక, ఎన్నికల సంబంధిత అంశాలపైనా విస్తృతంగా చర్చించి నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది. మార్చి రెండో వారంలో బడ్జెట్ సమావేశాలను నిర్వహించే అవకాశంపై మంత్రివర్గం చర్చించి తుది నిర్ణయం తీసుకోనుంది. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి రావాల్సిన నిధులను సమర్థంగా సాధించేందుకు అనుసరించాల్సిన వ్యూహాలపై కూడా చర్చ జరిపి అధికారులకు తగిన మార్గదర్శకాలు ఇవ్వనున్నట్టు సమాచారం. ఇక హైదరాబాద్ మెట్రో రైలు టేకోవర్ అంశం ఈ సమావేశంలో అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. మెట్రో నిర్మాణ సంస్థ ఎల్ అండ్ టీ నుంచి ప్రాజెక్టును రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని ఇప్పటికే నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 202526 ముగిసే మార్చి 31లోపు ఈ ప్రక్రియను పూర్తి చేయాలని ప్రభుత్వం ప్రయత్నాలు వేగవంతం చేస్తోంది. మెట్రో ప్రాజెక్టుతో సంబంధం ఉన్న సుమారు రూ.10 వేల కోట్ల రుణాలను రాష్ట్ర ప్రభుత్వం టేకోవర్ చేయాల్సి ఉండగా, ఎల్ అండ్ టీకి దాదాపు రూ.2 వేల కోట్ల బకాయిలు చెల్లించాల్సిన పరిస్థితి ఉంది. ఈ నేపథ్యంలో మెట్రో టేకోవర్, రెండో దశ విస్తరణ అంశాలపై ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉపసంఘం ఆదివారం సమావేశమై ప్రభుత్వానికి సమర్పించాల్సిన నివేదికకు తుది రూపు ఇచ్చింది. ఆ నివేదికను కేబినెట్‌లో సమగ్రంగా పరిశీలించి తదుపరి చర్యలపై నిర్ణయం తీసుకోనున్నారు. మెట్రో టేకోవర్ ప్రక్రియ సజావుగా పూర్తయితే రెండో దశ ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వ అనుమతులు పొందడంలో ఉన్న అడ్డంకులు తొలగే అవకాశముందని ప్రభుత్వ వర్గాలు భావిస్తున్నాయి. ఇటీవల ముగిసిన మున్సిపల్ ఎన్నికల్లో అధిక స్థానాలు గెలుచుకుని ఉత్సాహంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం, తదుపరి స్థానిక సంస్థల ఎన్నికలపై దృష్టి సారించినట్టు తెలుస్తోంది. జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలతో పాటు జీహెచ్‌ఎంసీ, మల్కాజ్‌గిరి, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్లు, సహకార ఎన్నికలను కూడా త్వరితగతిన నిర్వహించే అంశంపైనా మంత్రివర్గంలో చర్చ జరిగే అవకాశముంది. డీసీసీబీ పాలక మండళ్ల ఎన్నికలను నామినేటెడ్ విధానంలో నిర్వహించే ప్రతిపాదనపైనా ప్రభుత్వం ఆలోచిస్తున్నట్టు సమాచారం. అదేవిధంగా రైతులకు 'రైతు భరోసా' ఆర్థిక సహాయం చెల్లింపుల అంశంపై కూడా కేబినెట్‌లో చర్చించి ప్రకటన చేసే వీలుంది. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు చెల్లించాల్సిన బకాయిలపై కూడా మంత్రివర్గం దృష్టి సారించి నిర్ణయం తీసుకుంటారనే

(మిగతా 2వ పేజీలో)



## ఏఐ సదస్సు భారత్‌కు కొత్తదిశ చూపిన మైలురాయి

**కృత్రిమ మేధలో భారత విజయాలు ప్రపంచాన్ని ఆకట్టుకున్నాయన్న మోదీ**

**ఇండియా ఏఐ ఇంపాక్ట్ సదస్సు కీలక మలుపుగా అభివర్ణన**

**'మన్ కీ బాత్'లో సాంకేతికత, సంస్కృతి, విద్యపై ప్రధానమంత్రి వ్యాఖ్యలు**

**డిజిటల్ మోసాలపై ప్రజలకు అప్రమత్తత సూచనలు**

**విదేశాల్లోనూ భారతీయ మూలాల ప్రతిభపై ప్రధాని ప్రశంసలు**

**బానిసత్వ గుర్తులను విడిచిపెడుతున్న దేశంగా భారత్ ప్రస్తావన**

న్యూఢిల్లీ: కృత్రిమ మేధ (ఏఐ) రంగంలో భారత్ సాధిస్తున్న పురోగతి ప్రపంచ దేశాలను ఆశ్చర్యానికి గురిచేస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఇటీవల ఢిల్లీలో జరిగిన ఇండియా ఏఐ ఇంపాక్ట్ సదస్సును దేశ సాంకేతిక భవిష్యత్తుకు దిశానిర్దేశం చేసే

(మిగతా 2వ పేజీలో)



## మూసీ పేరుతో ఇళ్లపై ఒత్తిడి: హరీశ్‌రావు

**సీఎం చర్యల్లో భూవివాదాలు, రియల్ ఎస్టేట్ కోణమేనని విమర్శ**

**డీపీఆర్, ఎఫ్‌టీఎల్ లేకుండానే నోటీసులు జారీ చేస్తున్నారన్న అభ్యంతరం**

**మధు పార్క్ నివాసితులకు ఇచ్చిన నోటీసులు వెంటనే ఉపసంహరించాలన్న డిమాండ్**

**అభివృద్ధి పేరిట పేదల ఇళ్లు కూల్చడం సరికాదన్న వ్యాఖ్య**

**మూసీ సుందరీకరణపై స్పష్టమైన విధానం లేదని ప్రభుత్వంపై ఆరోపణ**

**బాధిత కుటుంబాలకు బీఆర్ఎస్ నేతల పరామర్శ**

హైదరాబాద్ : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీసుకునే ప్రతి నిర్ణయంలో భూముల వ్యవహారాలు, రియల్ ఎస్టేట్ ప్రయోజనాలే ప్రధానంగా కనిపిస్తున్నాయని బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు తీవ్రంగా విమర్శించారు. సెంట్రల్ యూనివర్సిటీ భూముల విషయంలో ప్రయత్నాలు విఫలమయ్యాయని, ఎల్టీపీఎస్ భూములపైనా రియల్ ఎస్టేట్ దృష్టితో

(మిగతా 2వ పేజీలో)

## తెలంగాణకు అకాల వర్ష సూచన.. పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్



**నైరుతి బంగాళాఖాతంలో అల్పపీడనం, ద్రోణి ప్రభావం**

**పలు జిల్లాలకు హైదరాబాద్ వాతావరణ కేంద్రం ఎల్లో అలర్ట్**

**పంట నష్టంపై అప్రమత్తంగా ఉండాలంటూ రైతులకు సూచన**

**హైదరాబాద్‌లో మేఘావృతం.. సాయంత్రం వేళ జల్లులు**

## ఐఎన్ఎస్ అరిదమన్... భారత్ అమ్ములపొదిలో శత్రుభీకర అస్త్రం




**ఏప్రిల్-మే నాటికి భారత నావికాదళంలోకి చేరనున్న అణు జలాంతర్గామి ఐఎన్ఎస్ అరిదమన్**

**ఇప్పటికే ఉన్న అరిహంత్, అరిఘాత్ కంటే పెద్దది, ఎక్కువ క్షిపణులను మోసుకెళ్లగలదు**

**శత్రు రాడార్లకు చిక్కని అత్యాధునిక స్టెల్త్ టెక్నాలజీ, తక్కువ శబ్దం చేసే రియాక్టర్ దీని సొంతం**

**భారత ద్వితీయ అణుదాడి సామర్థ్యాన్ని ఈ సబ్‌మెరైన్ గణనీయంగా పెంచనుంది**

**పూర్తిగా విశాఖపట్నంలోనే స్వదేశీ పరిజ్ఞానంతో నిర్మాణం**

## హార్వర్డ్ నుంచి సీఎం రేవంత్‌రెడ్డికి ఆహ్వానం



**ఏఐ పాలసీ సింపోజియంలో ప్రసంగించనున్న ముఖ్యమంత్రి**

**తెలంగాణ ఏఐ సిటీ విజన్‌కు దక్కిన అంతర్జాతీయ గుర్తింపు**

**ఏఐ మౌలిక వసతులపై మాట్లాడనున్న రేవంత్ రెడ్డి**

# ఉద్రిక్తతల నడుమ 'చలో కామారెడ్డి' పిలుపు కలకలం

### బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు అరెస్ట్

### ముఖ్య నేతల ఇళ్ల వద్ద భారీగా పోలీసులు మోహరింపు

### ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు హౌస్ అరెస్టులు

### కామారెడ్డికి వెళ్లకుండా అడుగడుగునా అడ్డుకున్న పోలీసులు

### ప్రభుత్వ వైఖరిపై కమలనాథుల తీవ్ర విమర్శలు

### అరెస్టులను అప్రజాస్వామికమని నేతల ఆగ్రహం



బీజేపీ రాష్ట్ర నాయకత్వం ఇచ్చిన 'చలో కామారెడ్డి' పిలుపు ఆదివారం ఉద్రిక్త పరిస్థితులకు దారితీసింది. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావుతో పాటు పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల నివాసాల వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది. శనివారం రాత్రి నుంచే ప్రముఖ నేతల ఇళ్ల వద్ద పోలీసులు మోహరించి, వారు కామారెడ్డికి వెళ్లకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. రాత్రి నుంచే హౌస్ అరెస్టులో ఉన్న రాంచందర్‌రావు, ఎలాగైనా కామారెడ్డి పర్యటనకు వెళ్లాలని నిర్ణయించి

(మిగతా 2వ పేజీలో)



## కిస్త్వాడ్‌లో ఎన్‌కౌంటర్.. ముగ్గురు ఉగ్రవాదుల అంతం

జైష్ మాడ్యూల్‌పై భద్రతాబలగాల సాహసోపేత ఆపరేషన్

ఛత్రూ అరణ్యాల్లో గూఢచారి సమాచారంతో ముట్టడి

కాల్పులకు దిగిన మిలిటెంట్లపై ప్రతీకార కాల్పులు

కరుడుగట్టిన కమాండర్ సైఫుల్లా హతమై ఉండొచ్చన్న అనుమానం

మంచు ప్రాంతాల్లో సుదీర్ఘ గాలింపు తర్వాత విజయవంతమైన ఆపరేషన్

శ్రీనగర్, ఫిబ్రవరి 22: జమ్మూకశ్మీర్‌లో భద్రతాబలగాలు మరో కీలక విజయాన్ని నమోదు చేశాయి. కిస్త్వాడ్ జిల్లాలో ఆదివారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు ఉగ్రవాదులను మట్టుబెట్టినట్లు అధికారులు వెల్లడించారు. వీరు పాకిస్థాన్‌కు చెందిన జైష్-ఎ-మహమ్మద్ (జేఈఎం) తరఫున పనిచేస్తున్న మిలిటెంట్లని ప్రాథమికంగా గుర్తించినట్టు భద్రతా వర్గాలు తెలిపాయి. మంచుతో కప్పుకున్న

(మిగతా 2వ పేజీలో)

ఆపరేషన్ కగార్‌లో కీలక పరిణామం...

## మావోయిస్టు కీలక నేతలు లొంగుబాటు

**లొంగిపోయిన మావోయిస్టు నాయకులు దేవ్ జీ, మల్లారెడ్డి**

**తెలంగాణ ఎస్ఐబీ ఎదుట లొంగిపోయిన మావోయిస్టులు**

**వీరితో పాటు 16 మంది లొంగుబాటు**



కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'ఆపరేషన్ కగార్'లో కీలక పరిణామం చోటు చేసుకున్నది. మావోయిస్టు కీలక నేతలు దేవ్‌జీ, మల్లా రాజిరెడ్డి భద్రతా బలగాలకు సరెండర్ అయ్యారు. దేవ్ జీ మావోయిస్టు పార్టీ జనరల్ సెక్రటరీగా ఉండగా, రాజిరెడ్డి పొలిట్ బ్యూరో మెంబర్‌గా ఉన్నారు. రెండు రోజుల్లో వారిని మీడియా ముందు ప్రవేశపెట్టనున్నారు. వీరితో పాటు మరో 16 మంది మావోయిస్టులు లొంగిపోయారు. దేవ్‌జీ అలియాస్ తిరుపతి తెలంగాణ రాష్ట్రంలోని పెద్దపల్లి జిల్లాకు చెందినవాడు. వీరంతా తెలంగాణ ఎస్ఐబీ ఎదుట సరెండర్ అయ్యారు. నంబాల కేశవరావు ఎన్‌కౌంటర్ తర్వాత సెక్రటరీగా దేవ్ జీ అలియాస్ తిప్పిరి తిరుపతి మావోయిస్టు పార్టీకి సారథ్యం వహిస్తున్నారు.

వాయిస్ టుడే
జనగాత్రం - మనసేత్రం
సోమవారం, ఫిబ్రవరి 23, 2026

## మూసీ పేరుతో ఇళ్లపై ఒత్తిడి: హరీశ్‌రావు

వ్యవహరించాలనే ఆలోచనలు చేశారని ఆరోపించారు. మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టు పేరుతో ఇళ్లు కూల్చి భూములను స్వాధీనం చేసుకుని పెద్ద కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టాలనే ప్రయత్నం జరుగుతోందని ఆయన అన్నారు. మూసీ సుందరీకరణ కారణంగా ఇళ్లు కోల్పోయే పరిస్థితి ఎదుర్కొంటున్న మధు పార్క్ అపార్ట్‌మెంట్ నివాసితులను హరీశ్‌రావుతో పాటు మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్యేలు సుధీర్‌రెడ్డి, మాధవరం కృష్ణారావు తదితరులు పరామర్శించి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వానికి మూసీ ప్రక్షాళనపై స్పష్టమైన పాలసీ గానీ, సమగ్ర విధానం గానీ లేదని విమర్శించారు. పూటకో విధంగా నిర్ణయాలు తీసుకుంటూ ప్రజల్లో అనిశ్చితి సృష్టిస్తున్నారని అన్నారు. కేసీఆర్ కాలంలో ఫార్మా సిటీ కోసం సేకరించిన భూములను ఇప్పుడు వేరే పేర్లతో వినియోగిస్తూ రియల్ ఎస్టేట్ కోణంలో మార్పులు చేస్తున్నారని ఆరోపించారు. మూసీ శుద్ధికి తమకు ఎలాంటి అభ్యంతరం లేదని, అయితే అభివృద్ధి పేరిట పేదలు, మధ్యతరగతి ప్రజల ఇళ్లు కూల్చడాన్ని మాత్రమే వ్యతిరేకిస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. లక్ష కోట్ల రూపాయల వ్యయంతో చేపడుతున్న ప్రాజెక్టు ద్వారా అసలు ఎవరి ప్రయోజనాలు నెరవేరుతున్నాయో ప్రభుత్వం వెల్లడించాలని ప్రశ్నించారు. మధు పార్క్ అపార్ట్‌మెంట్ నివాసితులకు ఇచ్చిన నోటీసులను బేషరతుగా వెనక్కి తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. అధికారులు ఏ చట్టం ప్రకారం ఇళ్లు ఖాళీ చేయాలని నోటీసులు ఇస్తున్నారో ప్రజలకు అర్థం కావడం లేదని అన్నారు. ఒక మధ్యతరగతి కుటుంబానికి ఇల్లు అంటే జీవితకాలపు కల అని, దానిని ఒక్కసారిగా ఖాళీ చేయమని ఒత్తిడి చేయడం అన్యాయమని వ్యాఖ్యానించారు. ఇప్పటివరకు మూసీ సుందరీకరణ ప్రాజెక్టుకు సంబంధించి పూర్తి స్థాయి డీపీఆర్ లేదని, ఎఫ్‌టీఎల్ ఖరారు కాలేదని, పర్యావరణ అనుమతులు కూడా లభించలేదని హరీశ్‌రావు పేర్కొన్నారు. సోషల్ ఇంపాక్ట్ అసెస్‌మెంట్ కూడా జరగలేదని, అలాంటి పరిస్థితుల్లో నివాసితులకు నోటీసులు ఇవ్వడం సరైన విధానం కాదని నిలదీశారు. ప్రభుత్వం వెంటనే స్పష్టత ఇవ్వడంతో పాటు బాధితుల ఆందోళనలను పరిగణనలోకి తీసుకోవాలని ఆయన కోరారు.

### నేటి మంత్రివర్గ భేటీ

ఆశాభావం ఉద్యోగ సంఘాల్లో వ్యక్తమవుతోంది. పాలనాపరమైన మరికొన్ని అత్యవసర అంశాలకు సంబంధించిన పలు ఆర్డినెన్స్‌లను కూడా ఈ సమావేశంలో ఆమోదించే అవకాశం ఉందని సమాచారం. మొత్తంగా నేటి మంత్రివర్గ భేటీ రాష్ట్ర ఆర్థిక, పరిపాలనా, మౌలిక సదుపాయాల అభివృద్ధి దిశలో కీలక నిర్ణయాలకు వేదిక కానుందని భావిస్తున్నారు.

## ఉద్రిక్తతల నడుమ 'చలో కామారెడ్డి' పిలుపు కలకలం

ఆదివారం ఉదయం ఇంటి నుంచి బయటకు రావడంతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. అక్కడే ఉన్న పోలీసులు ఆయనను అడ్డుకోవడంతో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తార్నాకకు చేరుకుని నిరసన చేపట్టారు. ఈ క్రమంలో పోలీసులతో బీజేపీ శ్రేణుల మధ్య తోపులాటలు చోటుచేసుకుని ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. పరిస్థితి అదుపులోకి తెచ్చేందుకు పోలీసులు రాంచందర్‌రావుతో పాటు మరికొందరు నాయకులను అదుపులోకి తీసుకుని బొల్లారం, గాంధీనగర్ పోలీస్ స్టేషన్‌లకు తరలించారు. సికింద్రాబాద్ మహేంద్రహిల్స్‌లో ఎమ్మెల్సీ మల్క కొమరయ్యను, గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్‌ను హౌస్ అరెస్టు చేసినట్టు సమాచారం. అదేవిధంగా పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను కూడా గృహ నిర్బంధంలో ఉంచారు. ఈ అరెస్టులపై బీజేపీ నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో రౌడీ రాజ్యం నడుస్తోందని కేంద్రమంత్రి సంజయ్ విమర్శించారు. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే దాడులకు దిగడం సరైన విధానం కాదని, కాంగ్రెస్ మరియు ఎంఐఎం కలిసి అరాచకాలకు పాల్పడుతున్నాయని ఆరోపించారు. కామారెడ్డి ఘటనల్లో స్పష్టంగా రాళ్ల దాడులు జరిగినప్పటికీ చర్యలు తీసుకోవడం లేదని, బాన్సువాడలో 70 మందిని అక్రమంగా అరెస్టు చేశారని ఆయన పేర్కొన్నారు. ఈ పరిస్థితులను అడ్డుకోవడానికి బీజేపీ కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపక్షాల గొంతు నొక్కే కుట్ర పన్నుతోందని ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. నియంతృత్వ ధోరణిలో వ్యవహరిస్తూ గత ప్రభుత్వాన్ని తలపించే విధంగా చర్యలు తీసుకుంటోందని విమర్శించారు. ఇదే విధంగా కొనసాగితే ప్రభుత్వానికి రాజకీయంగా నష్టం వాటిల్లుతుందని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం పోలీసులను అడ్డుపెట్టుకుని నిర్బంధ పాలన కొనసాగిస్తోందని ఎంపీ డీకే అరుణ మండిపడ్డారు. సొంత పార్టీ ఎమ్మెల్యేకు సంఘీభావం తెలిపేందుకు వెళ్లడమే నేరంగా పరిగణించి అక్రమ అరెస్టులకు పాల్పడటం హేయమని వ్యాఖ్యానించారు. బీజేపీని అణచివేసే ప్రయత్నం జరుగుతోందని ఆమె ఆరోపించారు. రాంచందర్‌రావు అరెస్టు అప్రజాస్వామికమని ఎంపీ ఈటల రాజేందర్ పేర్కొన్నారు. గతంలో జరిగిన హౌస్ అరెస్టుల తరహా చర్యలు మళ్లీ పునరావృతమవుతున్నట్లు కనిపిస్తున్నాయని, అధికార పార్టీ నేతలే గూండాయిజానికి పాల్పడుతున్నారని విమర్శించారు. అరెస్టుకు ముందు రాంచందర్‌రావు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు 1975 ఎమర్జెన్సీ కాలాన్ని గుర్తుచేస్తున్నాయని తీవ్రంగా విమర్శించారు. కామారెడ్డి, బాన్సువాడ ఘటనల అనంతరం ప్రశ్నించే వారినే లక్ష్యంగా చేసుకుని అక్రమ అరెస్టులు చేస్తున్నారని దుయ్యబట్టారు. బీజేపీ నేతల హౌస్ అరెస్టులు కక్షసాధింపే చర్యలని జి. కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాల్సిన ప్రభుత్వమే దాన్ని ఖూనీ చేస్తున్నదని, అధికార దుర్వినియోగంతో అరెస్టులకు దిగడం దురదృష్టకరమని అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం గేటును ధ్వంసం చేయడం వంటి ఘటనలు రాష్ట్రంలో శాంతిభద్రతల వైఫల్యాన్ని సూచిస్తున్నాయని విమర్శించారు. రాష్ట్రంలో బీజేపీ ఎదుగుదలను చూసి భయపడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతీకార రాజకీయాలకు పాల్పడుతోందని ఆయన ఆరోపించారు.

## కిస్త్వాడ్‌లో ఎన్‌కౌంటర్.. ముగ్గురు ఉగ్రవాదుల అంతం



ఛత్రూ అరణ్య ప్రాంతంలోని ఒక కొండ దిగువనున్న మట్టి ఇంట్లో ఉగ్రవాదులు దాక్కున్నారన్న ఖచ్చితమైన గూఢచారి సమాచారం అందడంతో భద్రతాబలగాలు 'ఆపరేషన్ ట్రాషి-ఐ' పేరుతో విస్తృత గాలింపు చర్యలు చేపట్టాయి. క్లిష్టమైన భౌగోళిక పరిస్థితుల్లో సైన్యం, ఇతర భద్రతా దళాలు సంయుక్తంగా ప్రాంతాన్ని చుట్టుముట్టి జాగ్రత్తగా ముందుకు సాగాయి. గాలింపు దళాలు సమీపానికి చేరుకున్న వెంటనే ఉగ్రవాదులు కాల్పులకు దిగినట్లు సమాచారం. దీంతో జవాన్లు అప్రమత్తంగా ఎదురుకాల్పులు జరిపి తీవ్రంగా ప్రతిఘటించారు. కొంతసేపు జరిగిన కాల్పుల అనంతరం ముగ్గురు మిలిటెంట్లు హతమైనట్టు అధికారులు ధృవీకరించారు. మృతి చెందిన వారిలో జేఈఎంకు చెందిన కరుడుగట్టిన కమాండర్ సైఫుల్లా కూడా ఉన్నాడనే అనుమానం వ్యక్తమవుతోంది. అతని గుర్తింపును నిర్ధారించేందుకు భద్రతా సంస్థలు విచారణ కొనసాగిస్తున్నాయి. ఆ ప్రాంతంలో ఇంకా ఎవరైనా దాక్కున్న అవకాశాన్ని దృష్టిలో ఉంచుకుని పరిసర ప్రాంతాల్లో కూంబింగ్ ఆపరేషన్లు కొనసాగిస్తున్నట్టు అధికారులు తెలిపారు.

# ఏఐ సదస్సు భారత్‌కు కొత్తదిశ చూపిన మైలురాయి



టర్నింగ్ పాయింట్‌గా ఆయన అభివర్ణించారు. భవిష్యత్తులో ఏఐ శక్తిని సమర్థంగా వినియోగించుకునేందుకు ఈ సదస్సు కీలకంగా మారుతుందని చెప్పారు. ఆదివారం 'మన్ కీ బాత్' కార్యక్రమంలో భాగంగా దేశ ప్రజలను ఉద్దేశించి రేడియో ప్రసంగంలో ఆయన ఈ విషయాలు వెల్లడించారు. సదస్సుకు ప్రపంచ దేశాల ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు, సీఈఓలు, స్టార్టప్ వ్యవస్థాపకులు, సాంకేతిక ఆవిష్కర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారని ప్రధాని గుర్తుచేశారు. ముఖ్యంగా రెండు అంశాలు అంతర్జాతీయ నాయకులను విశేషంగా ఆకట్టుకున్నాయని ఆయన తెలిపారు. అమూల్ పాల కేంద్రాన్ని సందర్శించిన వారు రైతులు తమ పాడి పశువులను ఏఐ సాంకేతికతతో నిరంతరం పర్యవేక్షించే విధానాన్ని ఆసక్తిగా పరిశీలించారని చెప్పారు. అలాగే భారత ప్రాచీన గ్రంథాలు, విజ్ఞానం, రాతప్రతులను ఏఐ టెక్నాలజీతో పరిరక్షిస్తూ నూతన తరాలకు అందిస్తున్న విధానాన్ని చూసి వారు ఆశ్చర్యపోయారని వివరించారు. సదస్సులో మూడు 'మేడ్ ఇన్ ఇండియా' ఏఐ మోడళ్లను విడుదల చేయడం కూడా గర్వకారణమని పేర్కొన్నారు. డిజిటల్ యుగంలో ఆన్‌లైన్ ఆర్థిక మోసాలు, డిజిటల్ అరెస్టుల వంటి మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మోదీ సూచించారు. ముఖ్యంగా వృద్ధులు ఎక్కువగా ఈ మోసాలకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. బ్యాంకింగ్ సేవలను వినియోగించే వారు కేవైసీ ప్రక్రియను సమయానికి పూర్తి చేసుకోవాలని సూచించారు. టీ20 క్రికెట్ ప్రపంచ కప్‌లో విదేశీ జట్ల తరఫున భారతీయ మూలాలున్న ఆటగాళ్లు అధికంగా ఆడుతున్నారని ప్రధాని హర్షం వ్యక్తం చేశారు. భారతీయులు ఎక్కడ ఉన్నా తమ మూలాలను మరచిపోరని, నివసిస్తున్న దేశాల అభివృద్ధికి కూడా కృషి చేస్తారని అన్నారు. ఇది భారతీయతకు ప్రత్యేక గుర్తింపుగా నిలుస్తుందని వ్యాఖ్యానించారు. దేశం క్రమంగా బానిసత్వపు గుర్తులను వదిలించుకుంటోందని మోదీ పేర్కొన్నారు. భారతీయ సంస్కృతి, వారసత్వాన్ని ప్రతిబింబించే చిహ్నాల విలువను గుర్తించే దిశగా కీలక చర్యలు జరుగుతున్నాయని చెప్పారు. రాష్ట్రపతి భవన్‌లో నిర్వహించనున్న రాజాజీ ఉత్సవ్ సందర్భంగా బ్రిటిష్ శిల్పి ఎడ్విన్ లూటెన్స్ విగ్రహం స్థానంలో స్వతంత్ర భారత తొలి గవర్నర్ జనరల్ సి. రాజగోపాలాచారి విగ్రహాన్ని ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. విద్యార్థులు పరీక్షలను భయపడకుండా ఆత్మవిశ్వాసంతో ఎదుర్కోవాలని ప్రధాని సూచించారు. పరీక్షల మార్కులు మాత్రమే ప్రతిభను నిర్ణయించవని, అవి జీవితంలో ఒక్క ప్రమాణం కాదని అన్నారు. చదివింది ఏకాగ్రతతో రాసే నైపుణ్యం పెంపొందించుకోవాలని, అనవసర ఆందోళనకు లోనుకాకుండా స్వయాన్ని నమ్మాలని విద్యార్థులకు సందేశం ఇచ్చారు. అలాగే కేరళలో కుంభమేళాగా ప్రసిద్ధి చెందిన మామంగం సంప్రదాయాన్ని ప్రస్తావించిన మోదీ, ఇది శతాబ్దాల వారసత్వాన్ని ప్రతిబింబించే విశిష్ట వేడుకగా పేర్కొన్నారు. దేశంలోని పలు రాష్ట్రాల్లో రైతులు సాధిస్తున్న విజయాలను కూడా ఆయన ప్రశంసిస్తూ, సాంకేతికతతో కూడిన వ్యవసాయం భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తోందని అభిప్రాయపడ్డారు.

# ఐఎన్‌ఎస్ అరిదమన్... భారత్ అమ్ములపొదిలో శత్రుభీకర అస్త్రం




సముద్ర జలాల్లో భారత అణు నిరోధక సామర్థ్యం అనూహ్యంగా పెరగనుంది. దేశీయంగా నిర్మించిన మూడో అరిహంత్-శ్రేణి అణు బాలిస్టిక్ క్షిపణి జలాంతర్గామి 'ఐఎన్‌ఎస్ అరిదమన్' ఈ ఏడాది ఏప్రిల్ లేదా మే నెలలో నావికాదళంలోకి ప్రవేశించేందుకు సిద్ధమైంది. ప్రస్తుతం ఇది సముద్ర పరీక్షల తుది దశలో ఉందని రక్షణ రంగ వర్గాలు వెల్లడించాయి. ఈ పరిణామం భారత నావికాదళ శక్తిని, ముఖ్యంగా ప్రతీకార దాడి సామర్థ్యాన్ని శిఖర స్థాయికి చేర్చనుంది. విశాఖపట్నంలోని షిప్ బిల్డింగ్ సెంటర్‌లో, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ వెసెల్ ప్రాజెక్టు కింద ఐఎన్‌ఎస్ అరిదమన్‌ను నిర్మించారు. 7,000 టన్నుల బరువున్న ఈ జలాంతర్గామి, ఇదివరకే సేవలు అందిస్తున్న ఐఎన్‌ఎస్ అరిహంత్, ఐఎన్‌ఎస్ అరిఘాత్ (6,000 టన్నులు) కంటే పెద్దది, శక్తిమంతమైనది. దీని బరువు పెరగడం వల్ల క్షిపణులను మోసుకెళ్లే సామర్థ్యం కూడా గణనీయంగా పెరిగింది. పాత నౌకల్లో కేవలం నాలుగు వర్టికల్ లాంచ్ సిస్టమ్ ట్యూబ్‌లు ఉండగా, అరిదమన్‌లో వీటి సంఖ్యను ఎనిమిదికి పెంచారు. దీని ద్వారా ఒకేసారి 24 స్వల్ప శ్రేణి సాగరిక (750 కి.మీ. పరిధి) క్షిపణులను లేదా 8 మధ్యంతర శ్రేణి (3,500 కి.మీ. పరిధి) క్షిపణులను ప్రయోగించవచ్చు. భవిష్యత్తులో రానున్న 6,000 కి.మీ. పరిధి గల ఖ-5 క్షిపణులను కూడా మోసుకెళ్లేలా దీనిని రూపొందించారు. అరిదమన్‌కు 83 మెగావాట్ల సామర్థ్యం గల కాంపాక్ట్ లైట్ వాటర్ రియాక్టర్ శక్తిని అందిస్తుంది. ఇది చాలా తక్కువ శబ్దం (లో అకౌస్టిక్ సిగ్నేచర్) చేస్తుంది. దీంతో పాటు అనెకోయిక్ టైల్స్, స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధి చేసిన 'ఉషస్', 'పంచేంద్రియ' వంటి అత్యాధునిక సోనార్ వ్యవస్థల వల్ల సముద్ర గర్భంలో శత్రు రాడార్లకు, సోనార్లకు చిక్కకుండా అత్యంత రహస్యంగా కదలగలదు. ఉపరితలంపై గంటకు 12-15 నాట్ల వేగంతో, నీటి అడుగున 24 నాట్ల వేగంతో ఇది ప్రయాణిస్తుంది. అరిదమన్ చేరికతో, భారత వ్యూహాత్మక దళాల కమాండ్ పరిధిలోకి మూడు అణు జలాంతర్గాములు వస్తాయి. దీనివల్ల 'నిరంతర సముద్ర పర్యవేక్షణ' సాధ్యమవుతుంది. అంటే, కనీసం ఒక అణు జలాంతర్గామి ఎల్లప్పుడూ సముద్రంలో పహారా కాస్తూ, శత్రువుల నుంచి ముప్పు ఎదురైతే వెంటనే ప్రతీకారం తీర్చుకోవడానికి సిద్ధంగా ఉంటుంది. దీనిని విశాఖపట్నం సమీపంలోని అత్యంత భద్రత కలిగిన నావికా స్థావరం 'ప్రాజెక్ట్ వర్ష'లో మోహరించనున్నారు. ఇది భారత అణు త్రివిధ దళాల (భూమి, గగనతలం, సముద్రం) సామర్థ్యాన్ని మరింత పటిష్ఠం చేస్తుంది. ఇదే సమయంలో రష్యా నుంచి చక్ర-III అటాక్ సబ్‌మెరైన్, జర్మనీ సహకారంతో ప్రాజెక్ట్-75(×) కింద మరో ఆరు జలాంతర్గాముల నిర్మాణం వంటి ప్రాజెక్టులతో భారత నావికాదళం తన శక్తిని మరింత విస్తరించుకుంటోంది.

# హార్వర్డ్ నుంచి సీఎం రేవంత్‌రెడ్డికి ఆహ్వానం

**ఏఐ పాలసీ సింపోజియంలో ప్రసంగించనున్న ముఖ్యమంత్రి**

**తెలంగాణ ఏఐ సిటీ విజన్‌కు దక్కిన అంతర్జాతీయ గుర్తింపు**

**ఏఐ మౌలిక వసతులపై మాట్లాడనున్న రేవంత్ రెడ్డి**



తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అమెరికాలోని ప్రతిష్ఠాత్మక హార్వర్డ్ కెన్నెడీ స్కూల్ నుంచి అరుదైన ఆహ్వానం అందింది. మార్చి 27న జరగనున్న 'ఏఐ పాలసీ సింపోజియం'లో ప్రసంగించాల్సిందిగా ఆహ్వానించినట్లు ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంఓ) ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. హార్వర్డ్ కెన్నెడీ స్కూల్‌లోని బిజినెస్ అండ్ గవర్నమెంట్ ప్రోగ్రామ్, ఏఐ అండ్ టెక్ పాలసీ కాకస్ సంయుక్తంగా ఈ సింపోజియంను నిర్వహిస్తున్నాయి. 'ఏఐ యాజ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ కంప్యూట్ పవర్: ఇంపాక్ట్ ఆన్ లివబిలిటీ & వర్క్‌ఫోర్స్' అనే అంశంపై జరిగే ప్యానెల్ చర్చలో సీఎం రేవంత్ రెడ్డి ప్రసంగిస్తారు. డేటా సెంటర్లు, ఇంధన వ్యవస్థలు, పబ్లిక్-ప్రైవేట్ భాగస్వామ్యం, బాధ్యతాయుతమైన ఏఐ విస్తరణకు అవసరమైన నైపుణ్యాల కల్పన వంటి అంశాలపై ఈ సెషన్‌లో చర్చిస్తారు. భారత్ ఫ్యూచర్ సిటీ చొరవలో భాగంగా తెలంగాణలో 'ఏఐ సిటీ' నిర్మించాలన్న ప్రభుత్వ దార్శనికత, నాయకత్వానికి ఈ ఆహ్వానం ఒక గుర్తింపు అని సీఎంఓ పేర్కొంది. ఏఐ పర్యావరణ వ్యవస్థను ప్రోత్సహించడంలో భూ కేటాయింపులు, విద్యుత్ మౌలిక వసతులు, నైపుణ్యాభివృద్ధి, పెట్టుబడుల భాగస్వామ్యం వంటి అంశాల్లో రేవంత్ రెడ్డి పాలనా అనుభవం ప్రపంచ విధాన రూపకర్తలకు, పారిశ్రామికవేత్తలకు ఎంతో ఉపయోగపడుతుందని నిర్వాహకులు భావిస్తున్నారు. కృత్రిమ మేధస్సు (ఏఐ), టెక్నాలజీ పాలసీ, ఆవిష్కరణల ఆధారిత అభివృద్ధిలో తెలంగాణ నాయకత్వానికి పెరుగుతున్న అంతర్జాతీయ గుర్తింపునకు ఈ ఆహ్వానం నిదర్శనమని చెప్పవచ్చు. ఇటీవల ముఖ్యమంత్రి అమెరికాలో పర్యటించినప్పుడు ఈ సింపోజియం నిర్వాహకులు ఆయనతో సమావేశమై ఈ కార్యక్రమం గురించి చర్చించారు.

# తెలంగాణకు అకాల వర్ష సూచన.. పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్

**నైరుతి బంగాళాఖాతంలో అల్పపీడనం, ద్రోణి ప్రభావం**

**పలు జిల్లాలకు హైదరాబాద్ వాతావరణ కేంద్రం ఎల్లో అలర్ట్**

**పంట నష్టంపై అప్రమత్తంగా ఉండాలంటూ రైతులకు సూచన**

**హైదరాబాద్‌లో మేఘావృతం.. సాయంత్రం వేళ జల్లులు**



తెలంగాణలో వాతావరణం ఒక్కసారిగా మారింది. నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన బలమైన అల్పపీడనం, దానికి అనుబంధంగా ఉన్న ఉపరితల ద్రోణి ప్రభావంతో రాష్ట్రంలో రానున్న రెండు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. ఈ మేరకు పలు జిల్లాలకు 'ఎల్లో అలర్ట్' జారీ చేసింది. ప్రస్తుతం సముద్ర మట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తులో ఏర్పడిన ద్రోణి.. మధ్య తమిళనాడు, కర్ణాటక మీదుగా మహారాష్ట్ర వరకు విస్తరించి ఉంది. దీని కారణంగా సోమ, మంగళవారాల్లో రాష్ట్రవ్యాప్తంగా ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడతాయని అధికారులు తెలిపారు. ముఖ్యంగా దక్షిణ, మధ్య తెలంగాణ జిల్లాల్లో వర్ష ప్రభావం అధికంగా ఉండనుంది. ఒకవైపు రాష్ట్రంలో ఎండలు మండిపోతుండగా, మరోవైపు వర్ష సూచన రావడం గమనార్హం. మార్చి రాకముందే గరిష్ఠ ఉష్ణోగ్రతలు 35 డిగ్రీలు దాటుతున్నాయి. ఈ అకాల వర్షాల వల్ల చేతికొచ్చిన పంటలు దెబ్బతినే ప్రమాదం ఉందని, రైతులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. సోమవారం భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, వరంగల్, యాదాద్రి, రంగారెడ్డి, మేడ్చల్, వికారాబాద్, నాగర్ కర్నూల్ సహా పలు జిల్లాల్లో వర్షాలు కురుస్తాయని, మంగళవారం కూడా వీటి ప్రభావం కొనసాగుతుందని వాతావరణ శాఖ పేర్కొంది. ఇక హైదరాబాద్ నగరంలో ఆకాశం మేఘావృతమై ఉంటుందని, సాయంత్రం లేదా రాత్రి వేళల్లో తేలికపాటి జల్లులు పడొచ్చని తాజా బులెటిన్‌లో వివరించింది.

# యూత్ కాంగ్రెస్ షర్ట్ లెస్ నిరసనపై తీవ్రస్థాయిలో స్పందించిన ప్రధాని మోదీ

ప్రధాని నరేంద్ర మోదీ కాంగ్రెస్ పార్టీపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఢిల్లీలో జరిగిన 'ఇండియా-ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026'లో యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు చొక్కాలు విప్పి నిరసన తెలపడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. దేశంలోనే అత్యంత పురాతన పార్టీ అయిన కాంగ్రెస్ సైద్ధాంతికంగా దివాలా తీసిందని ఈ ఘటన స్పష్టం చేస్తోందని ఆదివారం మీరట్‌లో జరిగిన ఓ బహిరంగ సభలో విమర్శించారు. కొద్ది రోజుల క్రితం ఢిల్లీలోని భారత్ మండపంలో జరిగిన ఈ అంతర్జాతీయ సదస్సులో, నిరుద్యోగం, ద్రవ్యోల్బణం వంటి అంశాలపై యూత్ కాంగ్రెస్ సభ్యులు ప్రధానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ అర్ధనగ్న ప్రదర్శన చేశారు. ఈ ఘటనపై మోదీ స్పందిస్తూ, "భారత్ అభివృద్ధి చెందిన దేశంగా మారాలని ప్రజలు కష్టపడుతుంటే, దేశ ప్రగతిని కొన్ని పార్టీలు జీర్ణించుకోలేకపోతున్నాయి. ప్రపంచంలోనే అతిపెద్ద ఏఐ సదస్సును భారత్ నిర్వహించడం ప్రతి ఒక్కరికీ గర్వకారణం. కానీ కాంగ్రెస్ ఈ ప్రపంచ వేదికను తమ నీచ, నగ్న రాజకీయాలకు వాడుకుంది" అని అన్నారు. "విదేశీ అతిథుల ముందు కాంగ్రెస్ నేతలు నగ్నంగా నిలబడ్డారు. అసలు మీ నగ్నత్వం దేశానికి ఇప్పటికే తెలుసు, మళ్లీ కొత్తగా బట్టలు విప్పాల్సిన అవసరం ఏముంది?" అని ప్రధాని ప్రశ్నించారు. సొంత దేశం పరువు తీయడమే కాంగ్రెస్ పనిగా పెట్టుకుందని ఆయన ఆరోపించారు. తనకు వ్యతిరేకంగా కాంగ్రెస్ నేతలు తన సమాధి తవ్వాలని చూడటం, తన తల్లిని దూషించడం వంటివి చేస్తున్నారని, అయితే దేశ ప్రతిష్ఠకు సంబంధించిన కార్యక్రమంలో ఇలా ప్రవర్తించడం హద్దులు మీరడమేనని అన్నారు. దేశం పరువు తీసిన వారిని విమర్శించాల్సింది పోయి, కాంగ్రెస్ అగ్రనేతలు ఆ నిరసనకారులను ప్రశంసించడం దురదృష్టకరమని మోదీ వ్యాఖ్యానించారు. అయితే, ఈ ఘటనపై కాంగ్రెస్‌ను విమర్శించిన ఇండియా కూటమిలోని భాగస్వామ్య పక్షాలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

# దేశ రాజధానిలో కర్క నాగరాజుకు వరల్డ్ అచీవర్స్ అవార్డు 2026 - మూసాపేట్‌కు గర్వకారణం

కూకట్ పల్లి : ఫిబ్రవరి 22(వాయిస్ టుడే ): కూకట్పల్లి నియోజకవర్గం మూసాపేట్ డివిజన్‌కు చెందిన ఐఎన్‌టీయూసీ మరియు పీజేఆర్ ఫౌండేషన్ అధ్యక్షులు కర్క నాగరాజుకు అత్యంత ప్రతిష్టాత్మకమైన "వరల్డ్ అచీవర్స్ అవార్డు 2026" ప్రదానం చేయబడింది. దేశ రాజధాని న్యూ ఢిల్లీ లోని హ్యాట్ సెంట్రిక్ జానకిపూరి లో ఘనంగా నిర్వహించిన కార్యక్రమంలో ఈ అవార్డును భారత మాజీ క్రికెటర్ చేతన్ శర్మ చేతుల మీదుగా అందుకున్నారు. సోషల్ సర్వీస్ మరియు ట్రేడ్ యూనియన్ లీడర్‌షిప్ విభాగంలో ఆయనను ఎంపిక చేశారు. అవార్డు స్వీకరించిన అనంతరం కర్క నాగరాజు మీడియాతో మాట్లాడుతూ, తన సామాజిక సేవలు మరియు ట్రేడ్ యూనియన్ ద్వారా కార్మికులకు అందిస్తున్న సేవలను గుర్తించి ఈ గౌరవాన్ని ప్రదానం చేసిన వరల్డ్ అచీవర్స్ సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు. "ఈ అవార్డు రావడం పట్ల నాకు అపారమైన ఆనందం. ఇది కేవలం నా వ్యక్తిగత విజయం మాత్రమే కాదు, నా ప్రయాణంలో నాతో పాటు నిలిచిన ప్రతి ఒక్కరి సమిష్టి కృషికి వచ్చిన గుర్తింపు. ఈ అవార్డు నా పై మరింత బాధ్యతను పెంచింది. నాయకత్వం అనేది పదవి గురించి కాదు; బాధ్యత, అంకితభావం మరియు సేవ గురించి అని నేను గట్టిగా నమ్ముతున్నాను" అని పేర్కొన్నారు.



మాజీ భారత క్రికెటర్ చేతన్ శర్మ నుండి ఈ ప్రతిష్టాత్మక అవార్డును అందుకోవడం తన జీవితంలో ఒక చిరస్మరణీయమైన మైలురాయిగా నిలిచిపోతుందని భావోద్వేగంతో తెలిపారు. కార్మికుల సంక్షేమం మరియు సమాజ అభ్యున్నతి కోసం తన సేవలను మరింత విస్తరించేందుకు ఈ గుర్తింపు ప్రేరణనిస్తుందని చెప్పారు. ప్రతి సవాలులో తనకు తోడుగా నిలిచిన కార్మికులు, మద్దతుదారులు మరియు కుటుంబ సభ్యులకు ఈ గౌరవాన్ని అంకితం చేస్తున్నట్లు తెలిపారు. వరల్డ్ అచీవర్స్ అవార్డు నిర్వాహకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతూ, భవిష్యత్తులో మరింత సమగ్రతతో మరియు అభిరుచితో సేవలను కొనసాగిస్తానని కర్క నాగరాజు స్పష్టం చేశారు.



## నేతాజీ చారిటబుల్ ట్రస్ట్ నిర్వహణలో ఉచిత వైద్య శిబిరం మరియు రక్తదాన శిభిరం

### కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి

కుత్బుల్లాపూర్ ఫిబ్రవరి22(వాయిస్ టుడే): కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాజులరామారం పరిధిలోని ఉసోదాయ కాలనీ సీనియర్ కాంగ్రెస్ నాయుకులు దేగల సతీష్ బాబు ఆధ్వర్యంలో, నేతాజీ చారిటబుల్ ట్రస్ట్ నిర్వహణలో ఉచిత వైద్య శిబిరం మరియు రక్తదాన శిభిరం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా హన్మాంతన్న మాట్లాడుతు ఆయన, ప్రజల ఆరోగ్య రక్షణ కోసం ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు ఎంతో ఉపయోగకరమని తెలిపారు. ముఖ్యంగా ఆర్థికంగా వెనుకబడిన వర్గాల వారికి వైద్య సేవలు అందించడంలో ఇటువంటి కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై వైద్య పరీక్షలు చేయించుకొని, నిపుణులైన వైద్యుల నుండి సలహాలు పొందారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేయడం జరిగింది. ఇలాంటి సేవా కార్యక్రమాలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తాయని, భవిష్యత్తులో కూడా మరిన్ని వైద్య శిబిరాలు నిర్వహించాలని నిర్వాహకులను అభినందించారు. ప్రజలు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## నేతాజీ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ దేగల సతీష్ బాబు ఆధ్వర్యంలో ఉచిత వైద్య, రక్తదాన శిబిరం



కుత్బుల్లాపూర్ ఫిబ్రవరి22(వాయిస్ టుడే ): నేతాజీ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ దేగల సతీష్ బాబు, నర్సింహారెడ్డి, కృష్ణారెడ్డి, సురేందర్ రెడ్డి, సందీప్, సాయి, డేవిడ్ రాజు, మధు, సోమశేఖర గౌడ, గురు ప్రసాద్, సత్యనారాయణ, నారాయణ, రమేష్, శ్రీనివాసరావు, కుంపట్ల శ్రీనివాస్ రావు, సురేష్, మిత్ర బృందం వారి ఆధ్వర్యంలో ఉచిత వైద్య మరియు రక్తదాన శిబిరం శిఖరం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి చిరంజీవి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సోలిస్ ఐ కేర్ హాస్పిటల్స్, జెమ్‌కేర్ కామినేని హాస్పిటల్స్, ఉషోదయ, సెకండ్ ఇన్‌సైట్, లయన్స్ క్లబ్ సంస్థలు సహకార సంస్థలుగా (కో - స్పాన్సర్డ్) వ్యవహరించాయి. ఈ సందర్భంగా దేగల సతీష్ బాబు మాట్లాడుతూ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో ఉండాలనే ఉద్దేశంతో ఈ ఉచిత వైద్య మరియు రక్తదాన శిబిరం శిఖరం నిర్వహించామని తెలిపారు. ఈ శిఖరం ద్వారా ఎవరికైనా ఉన్న వ్యాధులను తొలిదశలోనే గుర్తించి ప్రధమ చికిత్స పొందడం ద్వారా త్వరగా ఆరోగ్యవంతులుగా మారవచ్చని అన్నారు.



## లగ్డారం గ్రామ అభివృద్ధికి సంపూర్ణ సహకారం

### పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి

పటాన్చెరు : ఇస్నాపూర్ మున్సిపల్ పరిధిలోని లగ్దారం అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తున్నామని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. ఆదివారం లక్దారం గ్రామంలో నిర్వహించిన బిఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమావేశానికి ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో గెలుపు ఓటములు అత్యంత సహజమని.. అంతిమంగా గ్రామ అభివృద్ధి లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. అతి త్వరలోనే గ్రామంలో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు ఆయన తెలిపారు. గ్రామంలో పార్టీ పటిష్టతకు ప్రతి కార్యకర్త చిత్తశుద్ధితో పనిచేయాలని కోరారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడంలో కార్యకర్తలకు కీలకపాత్ర పోషించాల్సి ఉంటుందని తెలిపారు. అనంతరం నూతనంగా ఎన్నికైన ఇస్నాపూర్ మున్సిపల్ పాలకమండలి సభ్యులను ఘనంగా సన్మానించారు. ఈ సమావేశంలో పటాన్చెరు మాజీ జెడ్పిటిసి శ్రీకాంత్ గౌడ్, ఇస్నాపూర్ మున్సిపల్ చైర్ పర్సన్ మోటె సుమలత, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, కౌన్సిలర్లు, సీనియర్ నాయకులు శంకర్ గౌడ్, రాములు గౌడ్, మోటె కృష్ణ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## నందిగామ మల్లన్న జాతరలో పాల్గొన్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

పటాన్చెరు : పటాన్చెరు మండలం నందిగామ గ్రామంలో ఆదివారం నిర్వహించిన శ్రీశ్రీశ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి కళ్యాణ మహోత్సవం, జాతర కార్యక్రమాల్లో పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే జిఎంఆర్ ను ఘనంగా సన్మానించారు. స్వామి వారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. ఈ మల్లన్న జాతర మహోత్సవానికి హాజరైన అమీన్పూర్ మాజీ ఎంపీపీ దేవానందం, సీనియర్ నాయకులు దశరథ రెడ్డి, వెంకటరెడ్డి, శ్రీశైలం, గోపాల్, సత్యనారాయణ, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## కుమ్మెర్ చిన్నారి మృతి.. హైకోర్టు జోక్యం కోరిన హై కోర్టు అడ్వకేట్ ప్రసన్నకుమార్

ఉప్పల్ (వాయిస్ టుడే ప్రతినిధి ):- హైదరాబాద్ నాగర్‌కర్నూల్ జిల్లాలో జరిగిన రెండు నెలల చిన్నారి దారుణ మృతి ఘటనపై హైకోర్టు న్యాయవాది నోముల ప్రసన్నకుమార్ అత్యవసరంగా ఉన్నతాధికారులకు దరఖాస్తు సమర్పించారు. ఈ ఘటనపై వెంటనే స్పందించి పూర్తి స్థాయి విచారణ చేపట్టాలని ఆయన కోరారు. నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండలం కుమ్మెర్ గ్రామంలో మల్లన్న జాతర సందర్భంగా జరిగిన ఈ ఘటన తీవ్ర సంచలనం రేపుతోంది. బాధిత కుటుంబం తెలిపిన వివరాల ప్రకారం, ఆలయంలో దర్శనం చేసుకునే సమయంలో మహిళపై దాడి జరిగిందని, ఆమె కుటుంబ సభ్యులపై కూడా దౌర్జన్యం జరిగిందని ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలో రెండు నెలల చిన్నారి ప్రాణాలు కోల్పోయినట్లు చెబుతున్నారు. ఈ ఘటనలో స్థానిక పోలీసుల వైఖరి పట్ల కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఘటన సమయంలో పోలీసులు తగిన చర్యలు తీసుకోలేదని, కేసు నమోదు విషయంలో కూడా నిర్లక్ష్యం చూపారని బాధితులు ఆరోపిస్తున్నారు.



ఈ నేపథ్యంలో నోముల ప్రసన్నకుమార్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, రాష్ట్ర పోలీసు ఉన్నతాధికారులు, జిల్లా పరిపాలన అధికారులకు వినతిపత్రం పంపించారు. ఘటనపై నిష్పాక్షిక దర్యాప్తు జరిపించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, బాధిత కుటుంబానికి రక్షణ కల్పించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అలాగే, ఈ కేసును స్వతంత్ర ప్రత్యేక బృందంతో విచారించి నిజానిజాలు వెలికి తీయాలని, విచారణపై న్యాయపరమైన పర్యవేక్షణ ఉండాలని కూడా కోరారు. ఇదిలా ఉండగా, ఈ ఘటనపై స్థానికంగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. నాగర్‌కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ప్రజలు ఆందోళనలు చేపట్టారు. వివిధ సంఘాలు, ప్రజా ప్రతినిధులు ఈ ఘటనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. పోలీసులు మాత్రం ప్రాథమికంగా అనుమానాస్పద మృతి కేసుగా నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు తెలిపారు. అయితే, బాధిత కుటుంబం మరియు స్థానికులు ఈ విషయంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.



## రేణుక ఎల్లమ్మ దయ భక్తులందరిపై ఉండాలి

### బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్

కుత్బుల్లాపూర్ ఫిబ్రవరి22(వాయిస్ టుడే): 125 - గాజుల రామారం డివిజన్ శ్రీ రేణుకా ఎల్లమ్మ తల్లి జాతర మరియు కళ్యాణోత్సవ కార్యక్రమానికి బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ముఖ్య అతిథిగా హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీ రేణుకా ఎల్లమ్మ తల్లి కృపా కటాక్షాలు భక్తులందరిపై ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## కుత్బుల్లాపూర్ నియోజకవర్గ రాజకీయాల్లో కీలక పరిణామం చోటు

కుత్బుల్లాపూర్ ఫిబ్రవరి22(వాయిస్ టుడే ) : సీనియర్ నాయకులు మాజీ కార్పొరేటర్ కే ఏం గౌరీష్ బి ఆర్ ఎస్ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల పట్ల ఆకర్షితులై ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి టీపీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతి రెడ్డి ఆధ్వర్యంలో, టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ సమక్షంలో ఆయనకు పార్టీ కండువా వేసి ఘనంగా ఆహ్వానించారు ఈ చేరికలో గణేష్ నగర్ డివిజన్ పలు బస్తిలా అధ్యక్షులు చేరారు అనంతరం హన్మాంతన్న మాట్లాడుతు. ఈ చేరికతో కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో రాజకీయ సమీకరణాలు మారే అవకాశాలు ఉన్నాయని రాజకీయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ఈ కార్యక్రమం లో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా గ్రంధాలయ చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్ రెడ్డి మరియు సీనియర్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



## శ్రీశ్రీశ్రీ రేణుక ఎల్లమ్మ కళ్యాణం మరియు జాతర కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకుడు కూన శ్రీనివాస్ గౌడ్

కుత్బుల్లాపూర్ ఫిబ్రవరి22 (వాయిస్ టుడే): కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని గాజులరామారం సర్కిల్ పరిధిలో గల ఉన్నటువంటి ప్రఖ్యాతగాంచిన చిత్తరమ్మ దేవి ఆలయ ప్రాంగణంలో శ్రీశ్రీశ్రీ రేణుక ఎల్లమ్మ కళ్యాణం మరియు జాతర కార్యక్రమంలో ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు స్థానిక కాంగ్రెస్ నాయకుడు కూన శ్రీనివాస్ గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై ఆ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆ రేణుక ఎల్లమ్మ తల్లి దీవెనలు మరియు ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు మరియు అర్చకులు శ్రీనివాస్ గౌడ్ శాలువాతో సత్కరించి అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ముత్యపాగ రవి, పెరుమాండ్ల రవి, ముత్యపాగ నర్సింగరావు, ఆర్ బాలరాజు, సాగర్, కూన హరి, రాజేష్, సురేష్, నర్సింగ్ మరియు ఆలయ కమిటీ సభ్యులు మరియు స్థానిక నాయకులు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## దైవ చింతనతోనే మానసిక ప్రశాంతత

### కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు శంభీపూర్ క్రిష్ణ

కుత్బుల్లాపూర్ ఫిబ్రవరి22(వాయిస్ టుడే): జిహెచ్ఎంసి దుందిగల్ సర్కిల్ పరిధి మల్లంపేటలోని బావనాస్ జిఎల్సి క్లిఫ్స్ గేటెడ్ కమ్యూనిటీలో నూతనంగా నిర్మించిన శ్రీశ్రీశ్రీ విజయ గణపతి దేవాలయం ప్రాణ ప్రతిష్ట మరియు ధ్వజస్తంభ ప్రతిష్టాపన కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించిన కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు శంభీపూర్ క్రిష్ణ ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... విజయ గణపతి ఆశీస్సులతో చేపట్టిన ప్రతి పనిలో విజయం చేకూరాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ కౌన్సిలర్ హనుమంతరావు మరియు స్థానిక నాయకులు, కాలనీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## కూకట్‌పల్లి వై జంక్షన్‌లో "పెళ్లిళ్ల సీజన్" ఆఫర్‌కు ఘన ప్రారంభం

**– జిట్టా రమ్యకృష్ణ సునీల్ యాదవ్ హాజరు**

కూకట్ పల్లి : ఫిబ్రవరి 22(వాయిస్ టుడే): కూకట్‌పల్లి నియోజకవర్గం పరిధిలో ఆదివారం కూకట్‌పల్లి వై జంక్షన్‌లోని ది చెన్నై సిల్క్స్ లో "పెళ్లిళ్ల సీజన్" ప్రత్యేక ఆఫర్‌ను స్టేట్ యూత్ కాంగ్రెస్ సెక్రటరీ జిట్టా రమ్యకృష్ణ సునీల్ యాదవ్ ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో చెన్నై సిల్క్స్ ఏజీఎం ఆర్. మహేష్, ఏజీ త్యాగరాజ్, మేనేజర్ పి. నాగేందర్, శంకర్ తదితరులు పాల్గొన్నారు. పెళ్లిళ్ల సీజన్‌ను పురస్కరించుకుని కస్టమర్ల కోసం ప్రత్యేక రాయితీలు మరియు ఆఫర్లను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు నిర్వాహకులు తెలిపారు.



## కాంగ్రెస్ పార్టీ బలోపేతమే లక్ష్యంగా కార్యకర్త నుంచి నాయకుడి వరకు అందరూ కలిసికట్టుగా పనిచేయాలి

**– టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్**

కూకట్‌పల్లి, ఫిబ్రవరి 22(వాయిస్ టుడే): జూబ్లీ హిల్స్ ఉపఎన్నికలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ భారీ మెజార్టీతో గెలుపొందిన సందర్భంగా మధుర నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక కమ్యూనిటీ హాల్లో అభినందన సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పార్టీ కార్యకర్తల గట్టి పోరాట ఫలితంగానే జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో విజయం సాధ్యమైందని బండి రమేష్ అన్నారు.

గత అసెంబ్లీ ఎన్నికల అనంతరం తెలంగాణ రాష్ట్రంలో జరిగిన పార్లమెంటు, కంటోన్మెంట్, జూబ్లీహిల్స్ ఉపఎన్నికలతో పాటు ఇటీవల జరిగిన పంచాయతీ, మున్సిపాలిటీ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ పార్టీ విజయదుందుభి మోగించిందన్నారు. కార్యకర్తల కృషితో పాటు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలే ఈ విజయాలకు ప్రధాన కారణమని తెలిపారు. రానున్న జీహెచ్ఎంసీ ఎన్నికల్లో మూడు కార్పొరేషన్లలో కూడా కాంగ్రెస్ పార్టీ విజయకేతనం ఎగరేస్తుందని బండి రమేష్ విశ్వాసం వ్యక్తం చేశారు.



## ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

హైదరాబాద్, ఫిబ్రవరి 22: ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కాచిగూడ సి.సి. ష్రాఫ్ మెమోరి యల్ హాస్పిటల్ జనరల్ మేనేజర్లు ఎ. సోమారెడ్డి, మూర్తి, శేషాద్రి అన్నారు. కాచిగూడ సి.సి. ష్రాఫ్ మెమోరియల్ హాస్పిటల్, నందిని రమేష్ గాంధీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం ఘట్కేసర్ మండలంలోని వెంకటాపురం గ్రామ వార్డు కార్యాలయంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య శిబిరంలో పేద ప్రజలకు ఉచితంగా వైద్య సేవలు అందించి, వారికి ఉచితంగా మందులు అందజేసి, అవసరమైన వాళ్లకు ఉచితంగా రక్త పరీక్షలు, గుండె సంబంధిత పరీక్షలు నిర్వహించారు. ఉచిత శిబిరంలో ముఖ్యంగా జనరల్, మహిళలకు సంబంధిత వ్యాధు లకు, కీళ్ల సంబంధిత వ్యాధులకు, అనుభవజ్ఞులు అయిన డాక్టర్లచే ఈ ఉచిత వైద్య శిబిరం నిర్వహిం చారు. ఈ ఉచిత వైద్య శిబిరానికి వెంకటాపురం గ్రామ ప్రజల నుండి విశేష స్పందన లభించింది. ఈ యొక్క ఉచిత వైద్య శిబిరంలో డాక్టర్ భారతి, వరుణ్ జోషి, కోమల్ యాదవ్ పాల్గొన్నారు. హాస్పిటల్ యాజమాన్యం తరుపు నుండి జనరల్ మేనేజర్ ఎ. సోమా రెడ్డి, మూర్తి, శేషాద్రి కాచిగూడ లో మాట్లాడుతూ...ప్రజలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలన్నారు. యువత చెడు వ్యసనాలకు బారిన పడకుం డా ఒక లక్ష్యాన్ని ఏర్పరుచుకోవాల న్నారు. గ్రామంలోని 300 మందికి ఉచితంగా వైద్య సేవలు పొందా రు. ప్రతి ఏటా మేము ఉచిత వైద్య శిబిరం పేద ప్రజలకు అందించడం ఈ సంస్థ యొక్క ముఖ్య ఉద్దేశం అన్నారు. ఈ కార్యక్రమంలో వెంక టాపురం క్యాంప్ కో –ఆర్డినేటర్ గా నరేంద్ర బాబు, సోలంకే విలాస్, తనుగుల చిరంజీవి, హాస్పిటల్ స్టాఫ్ పాల్గొన్నారు.





## యధావిధిగా సోమవారం ప్రజావాణి కార్యక్రమం

**– యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు**

యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో.. (వాయిస్ టుడే ప్రతినిధి):– సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం యధాతధంగా ఉంటుందని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు నేడొక ప్రకటనలో తెలిపారు. ఈనెల 23 న సోమవారం నిర్వహించే గ్రీవెన్స్( ప్రజావాణి) కార్యక్రమం యధావిధిగా ఉంటుందని ప్రజల సమస్యల పై దరఖాస్తులను స్వీకరించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. కావున జిల్లాలోని ప్రజలకు ఏమైనా సమస్యలు ఉన్నట్లయితే కలెక్టరేట్ కు వచ్చి ఫిర్యాదులు ఇవ్వవచ్చని తెలిపారు.

## మురళీకృష్ణుడు అలంకరణలో దర్శనమిచ్చిన స్వామివారు

వాయిస్ టుడే/యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఆ బ్రహ్మోత్సవాల్లో భాగంగా 5వ రోజు ఉదయం (మురళీకృష్ణుడు) శ్రీ కృష్ణాలంకారంలో దర్శనమిచ్చిన స్వామి వారు తిరువీధుల్లో ఊరేగుతూ భక్తులను కనువిందు చేశారు యాదాద్రీశుడు. ఆలయ తిరువీధుల్లో స్వామివారు ఊరేగుతూ భక్తులను కనువిందు చేశారు. లోక కల్యాణం కోసం స్వామివారు వివిధ అవతారాలు ఎత్తారని అర్చకులు ఉపదేశించారు. ప్రత్యేకంగా తెప్పించిన పూలతో స్వామివారిని సర్వాంగ సుందరంగా అలంకరించారు. వజ్ర వైఢూర్యాలు ధరించిన స్వామివారు ఆలయ తిరువీధులో ఊరేగుతూ దగదగ మెరిసిపోయారు. ఈ సేవలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తరించారు...





## ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డినీ మర్యాదపూర్వకంగా కలిసిన 19వ వార్డు కౌన్సిలర్ పిల్లల మర్రి మధుసూదన్

హైద్రాబాద్ (వాయిస్ టుడే): చౌటుప్పల్ మున్సిపల్ 19వ వార్డు కౌన్సిలర్ పిల్లల మర్రి మధుసూదన్, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి నీ తన కుటుంబ సభ్యులతో మర్యాదపూర్వకంగా కలిసి సన్మానం చేశారు. తన వార్డ్ లోని పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి నిధులను కేటాయించి వార్డును అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు.



## బాతరాజు వెంకటేష్ కుటుంబాన్ని పరామర్శించిన కాంగ్రెస్ నాయకులు పర్నె శివారెడ్డి

**4 వేల రూపాయలు ఆర్థిక సహాయం**

హైద్రాబాద్ (వాయిస్ టుడే):చౌటుప్పల్ మున్సిపాలిటీకీ చెందిన కీర్తిశేషులు బాతరాజు వెంకటేష్ , మండల కాంగ్రెస్ నాయకులు పర్నె శివారెడ్డి వారి కుటుంబాన్ని పరామర్శించి భగవంతుడు ఆ కుటుంబానికి మనోధైర్యం కల్పించాలని మనస్ఫూర్తిగా కోరుకున్నారు. ఆ కుటుంబానికి నేను ఉన్న అంటూ భరోసా ఇచ్చి 40,000 ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ మల్లేష్,,మాందూరి సురేష్, బోస్ బాబు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## చీకటిగా గుండ్రంపల్లి జాతీయ రహదారిపై గల సర్వీస్ రోడ్డు



హైద్రాబాద్ (వాయిస్ టుడే):చిట్యాల మండలంలోని గుండ్రంపల్లి జాతీయ రహదారిపై గల సర్వీస్ రోడ్డులో లైట్లు రాక పది రోజులు అవుతుంది. లైట్లు రాక పది రోజులు అవుతున్నా కూడా జాతీయ రహదారి అధికారులు పట్టించుకోవట్లేదని బిఆరెస్ చిట్యాల మండల మైనార్టీ అధ్యక్షులు ఎండి వాజిద్ అన్నారు. పలుమార్లు అధికారులను సంప్రదించిన ఫలితాలు లేకుండా పోయిందని వాజిద్ అన్నారు. అలాగే అండర్ పాస్ బ్రిడ్జి లో లైట్ లు రెండు నెలలు కావస్తుంది అని అన్నారు.



## నందిగామ మల్లన్న జాతరలో పాల్గొన్న గడిల శ్రీకాంత్ గౌడ్ ఇస్నాపూర్ మున్సిపాలిటీ చైర్మన్ సుమలత శ్రీకాంత్

పటాన్ చెరు : పటాన్ చెరు మండలం నందిగామ గ్రామంలో జరిగిన శ్రీశ్రీశ్రీ బ్రహ్మరాంబిక మల్లికార్జున స్వామివారి జాతర మహోత్సవంలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్న పటాన్ చెరు మాజీ జెడ్పీటీసి గడీల శ్రీకాంత్ గౌడ్. ఈ కార్యక్రమంలో ఇస్నాపూర్ మున్సిపల్ చైర్మన్ సుమలత శ్రీకాంత్ యాదవ్,నందిగామ మాజీ ఉప సర్పంచ్ పల్లె శ్రీశైలం ,ఇస్నాపూర్ కౌన్సిలర్ మచ్చ కిషోర్ రెడ్డి,బీఆర్ఎస్ నాయకులు మోట కృష్ణ ,బీఆర్ఎస్వీ నాయకులు మేరాజ్ ఖాన్,ఇస్నాపూర్ మాజీ వార్డు సభ్యులు గోవర్ధన్ రెడ్డి ,గ్రామ పెద్దలు,ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.




# గ్రామ పంచాయతీ పాలనలో సర్పంచుల పాత్ర కీలకమైంది

**– యాదాద్రి భువనగిరి జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు**

యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో.. (వాయిస్ టుడే ప్రతినిధి):– గ్రామ పంచాయతీ పాలనలో సర్పంచుల పాత్ర కీలకమైందని, ప్రభుత్వం అందిస్తున్న శిక్షణను సర్పంచులు సద్వినియోగం చేసుకుని గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని స్థానిక సంస్థ ల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు అన్నారు. శనివారం పోచంపల్లి మండలం జలల్ పూర్ లోని స్వామి రామానంద తీర్థ ఇన్స్టిట్యూట్ లో నూతనంగా ఎన్నికైన సర్పంచ్ లకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాల్లో భాగం మండల లోని సర్పంచ్ లకి న ట్రైనింగ్ సెషన్ ని ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.... తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం 2018 లోని అంశాలను, విధివిధానాలను సర్పంచ్ లు క్షుణ్ణం గా అవగాహన కలిగి ఉండాలన్నారు. గ్రామాలు అభివృద్ధి చెందాలంటే సర్పంచులు తమ పాలనపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా వచ్చే నిధులను సక్రమంగా వినియోగించుకొని గ్రామాభివృద్ధికి పాటుపడాలని సూచించారు. గ్రామాలలో అన్ని రకాలుగా అభివృద్ధి జరగాలి అంటే సర్పంచ్ లు బాధ్యతాయుతంగా పని చేయాలన్నారు. సర్పంచ్ లు బాగా పని చేస్తేనే వారి గ్రామాలకు మంచి పేరు వస్తుందన్నారు. పంచాయతీ రాజ్ చట్టం లో సర్పంచ్ లకు పొందు పరిచిన అధికారాలు, విధులు తదితర అంశాల ను శిక్షణ లో భాగం గా క్షుణ్ణం గా అవగాహనచేసుకోవాలన్నారు. గ్రామాల్లో శానిటేషన్ నిర్వహణ, త్రాగు నీటి ఎద్దడి లేకుండా చూడడం లాంటి ప్రధాన అంశాల్లో సర్పంచ్ లు చురుకుగా పని చేయాలిసిన అవసరంఉంటుందన్నారు. ప్రతీ గ్రామం శుభ్రం గా ఉంచాలన్నారు. అనంతరం ఐదు రోజుల శిక్షణా కార్యక్రమం పూర్తయిన సర్పంచులకు ధ్రువీకరణ పత్రం అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి విష్ణువర్ధన్ రెడ్డి, ఎంపీడీవోలు, ఎంపీ ఓలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# బుద్ధవరంలో ఘనంగా అభయ ఆంజనేయ స్వామి తృతీయ వార్షికోత్సవం

## పట్టు వస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే యార్లగడ్డ



కృష్ణా జిల్లా–గన్నవరం: గన్నవరం మండలం బుద్ధవరం గ్రామంలో వేంచేసియున్న శ్రీ అభయ ఆంజనేయ స్వామివారి తృతీయ వార్షికోత్సవ వేడుకలు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా జరిగాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా ఆలయంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ప్రముఖ అర్చకులు గుదిమెళ్ల దిలీప్ కుమార్ ఆచార్యుల పర్యవేక్షణలో తెల్లవారుజాము నుండే స్వామివారికి విశేష పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. స్వామివారికి పంచామృత అభిషేకం, నవరసాభిషేకం, సింధూరాభిషేకంతో పాటు వివిధ రకాల పుష్పాలతో పుష్పాభిషేకం నేత్రపర్వంగా నిర్వహించారు. అనంతరం లోకకల్యాణార్థం గణపతి హోమం, లక్ష్మీ గణపతి హోమం, నవగ్రహ హోమం, ఆంజనేయ హోమం మరియు శాంతి హోమాలను శాస్త్రోక్తంగా పూర్తి చేశారు. ఈ వేద మంత్రోచ్ఛారణల మధ్య జరిగిన హోమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తరించారు. ఈ వేడుకల్లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆలయానికి చేరుకున్న ఆయనకు ఆలయ కమిటీ సభ్యులు మరియు అర్చకులు పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెంకట్రావు స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన యాగశాలలో జరిగిన పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆలయ ప్రాంగణంలో భారీగా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. గన్నవరం పరిసర ప్రాంతాల నుండి వేలాదిగా తరలివచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని, అన్నప్రసాదాన్ని స్వీకరించారు.



## నూతన వ్యాపార ప్రారంభోత్సవం చేసిన పాకాల, మాజీపిఎసిఎస్ రమణారెడ్డి

వాయిస్ టుడే నిర్మల్ జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 22: నిర్మల్ జిల్లా దిలావర్పూర్ మండలం లోలం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ ఒడ్నం కృష్ణ లోలంలో నూతనంగా ప్రారంభిస్తున్న ఆర్గానిక్ ఇస్తారు తయారు కేంద్రాన్ని పాకాల ఫౌండేషన్ చైర్మన్ పాకాల రామచందర్ పిఎసిఎస్ మాజీ చైర్మన్ రమణారెడ్డిలు సందర్శించి పూజ చేసి ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా పాకాల మాట్లాడుతూ ఆరోగ్యాన్ని ఇచ్చే ఆర్గానిక్ ఇస్తారుల తయారీ ప్రజానీకానికి ఎంతో ఉపయోగపడుతుందని మీరు వ్యాపారం దినదినాభివృద్ధి చెందాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజేశ్వర్, నవీన్ రెడ్డి, లింగం, ముత్యం ఉన్నారు.



## నాగార్జునసాగర్‌ను సందర్శించిన చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్

నాగార్జునసాగర్, ఫిబ్రవరి,22 (వాయిస్ టుడే) : అంతర్జాతీయ పర్యాట కేంద్రమైన నాగార్జునసాగర్ ను ఆదివారమనాడు అమ్రాబాద్ అటవీ డివిజన్ చీఫ్ కన్జర్వేటర్ సునీల్ హీరావత్ కుటుంబ సమేతంగా సందర్శించారు. సాగర్ సందర్శనలో భాగంగా బుద్ధవనాన్ని సందర్శించిన అనంతరం నాగార్జునకొండ మ్యూజియాన్ని సందర్శించారు. నాగార్జునకొండ మ్యూజియంలో భద్రపరిచిన బుద్ధ ధాతువులను దర్శించారు. అనంతరం నాగార్జున కొండపై పునర్నిర్మిత కట్టడాలైన సింహాల విహారము, మహా స్థూపం, అశ్వమేధ యజ్ఞశాలను వీక్షించారు. వీరికి స్థానిక టూరిజం గైడ్ సత్యనారాయణ బుద్ధవనం, నాగార్జునకొండ చారిత్రక విశేషాలను వివరించారు. వీరితోపాటు నల్గొండ జిల్లా అటవీ శాఖ అధికారి శాంతారాం, సాగర్ ఎఫ్ డి ఓ సునీత, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ గౌతమ్, సెక్షన్ ఆఫీసర్ రమేష్ ఉన్నారు.

## అంగన్వాడీల ఆధ్వర్యంలో 55వ డివిజన్ కార్పొరేటర్ మాజీ కౌన్సిలర్‌కు ఘన సన్మానం

**55వ డివిజన్లో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి కృషి చేస్తాం**

**కోతులు కుక్కల పట్టివేతకు కార్పొరేషన్ కౌన్సిల్లో తీర్మానిస్తాం**



భద్రాద్రి కొత్తగూడెం వాయిస్ టుడే ఫిబ్రవరి 22: కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ 55వ డివిజన్ కూలి లైన్ లో నూతనంగా ఎన్నికైన కార్పొరేటర్ సింగర హరిహరన్ ను మాజీ కౌన్సిలర్ సౌత్ సెంట్రల్ రైల్వే డి.ఆర్. యు సి.సి మెంబర్ వై. శ్రీనివాస్ రెడ్డిని యుక్తి పేద ప్రాంత సమాఖ్య ద్వాక్రా సంఘాల సభ్యులు అంగన్వాడి టీచర్స్ కలిసి ఘనంగా సత్కరించారు ఈ సందర్భంగా మాజీ కౌన్సిలర్ శ్రీనివాస్ రెడ్డి, కార్పొరేటర్ సింగర హరిహరన్ లు మాట్లాడుతూ తెలంగాణ ప్రజా ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో మహిళా సాధికారత కోసం ద్వాక్రా సంఘాల ఆర్థిక అభివృద్ధి కోసం ఎంతగానో కృషి జరుగుతుందని చెప్పారు. 55వ,డివిజన్ లో ద్వాక్రా సంఘాల సమావేశాలు వార్డు ప్రజల చిన్నచిన్న ఫంక్షన్స్, ప్రభుత్వ అధికారుల కార్యక్రమాల అమలు కోసం గతంలోనే 50 లక్షలు నిధులు తో శంకుస్థాపన చేయబడి పెండింగ్లో ఉన్న కమ్యూనిటీ హాల్ నిర్మించడం కోసం శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని వారు హామీ ఇచ్చారు. ప్రజలను గాయ పరుస్తూ భయపెడుతున్న కోతులను కుక్కలను పూర్తిగా పట్టించడానికి, కార్పొరేషన్ కౌన్సిల్ తోపాటు జిల్లా కలెక్టర్ కమిషనర్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారానికి డివిజన్ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని వారు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఆర్పి మీరాబాయి, ఓ.బీలు కాకటి లక్ష్మి, కమిటీ కార్ శోభ, లింగాలప్రమీల, చిప్పా లక్ష్మి అంగన్వాడీ టీచర్స్ ప్రసన్న లక్ష్మి రాధా రజిని పద్మ మరియు ద్వాక్రా శ్రీయుక్తి పేద ప్రాంత సమాఖ్యసభ్యులు డివిజన్ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## ఫుడ్ బ్యాంక్ భైంసా 5 వ వార్షికోత్సవం సందర్భంగా 200 వందల మంది నిరుపేదలకు అన్నదానం

వాయిస్ టుడే నిర్మల్ జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 22 : ఫుడ్ బ్యాంక్ భైంసా 5 వ వార్షకోత్సవం సందర్భంగా నిజామాబాద్ జిల్లా నందిపెట్ పరిసర ప్రాంతాలలో మరియు నిజామాబాద్ రైల్వే స్టేషన్లో..చుట్టూ పక్కల ప్రాంతాలలో నిరుపేదలకు అభాగ్యులకు దాదాపు 200 వందల మందికి మా అమ్మ నాన్న ఫౌండేషన్ చైర్మన్ యం ఆంజనేయులు చిమ్మ చీకట్లో అన్నదానం చేయడం జరిగింది.



## భైంసాలో "మన్ కీ బాత్" కార్యక్రమాన్ని వీక్షించిన ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్

వాయిస్ టుడే నిర్మల్ జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 22 : భైంసా పట్టణంలోని భారత ప్రధాని నరేంద్ర మోదీ దేశ ప్రజలను ఉద్దేశించి నిర్వహిస్తున్న మన్ కీ బాత్ 131వ ఎపిసోడ్ కార్యక్రమాన్ని భైంసా పట్టణంలోని 131వ బూత్‌లో వీక్షించారు. ఈ కార్యక్రమాన్ని ముధోల్ శాసనసభ్యులు పవార్ రామారావు పటేల్ నివాసంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ దేశ అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం చేపడుతున్న కార్యక్రమాలు ప్రజలకు మార్గదర్శకంగా నిలుస్తున్నాయని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు "మన్ కీ బాత్" కార్యక్రమం దోహదపడుతుందని పేర్కొన్నారు.

## మచిలీపట్నంలో జిల్లా టీడీపీ నూతన కార్యాలయానికి శంకుస్థాపన

### కార్యక్రమంలో పాల్గొన్న విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ



కృష్ణా జిల్లా–గన్నవరం: కృష్ణా జిల్లాలోని మచిలీపట్నంలో నూతన జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయ నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. వేద పండితుల వేదమంత్రోచ్ఛారణల నడుమ పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి కొల్లు రవీంద్ర, ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణ రావు, జిల్లా టీడీపీ అధ్యక్షులు, గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి గురుమూర్తి, ఏపీ ప్రభుత్వ విప్ గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, ఎమ్మెల్యే లు కాగిత కృష్ణ ప్రసాద్, బోడె ప్రసాద్, వెనిగండ్ల రాము, వర్ల కుమార్ రాజా శంకుస్థాపన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ బలోపేతం, కార్యకర్తల సమన్వయం కోసం నిర్మిస్తున్న కార్యాలయానికి తన వంతు సహకారంగా ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు రూ.5 లక్షల విరాళాన్ని ప్రకటించారు. భూమి పూజ అనంతరం మచిలీపట్నం జిల్లా టీడీపీ కార్యాలయం లో జరిగిన విలేకరుల సమావేశంలో యార్లగడ్డ మాట్లాడుతూ శాసనమండలి సమావేశాల్లో వైస్సార్సీపీ సభ్యుల ప్రవర్తన అత్యంత అమానుషంగా ఉందని మండిపడ్డారు. పవిత్రమైన వేంకటేశ్వర స్వామి ఫోటోలను రాజకీయ నిరసనలకు వాడుకోవడం, సభలోకి తీసుకురావడం హిందూ ధర్మంపై దాడి చేయడమేనని ధ్వజమెత్తారు. జగన్ మోహన్ రెడ్డి ఆదేశాలతోనే ఎమ్మెల్సీలు ఇటువంటి వికృత చేష్టలకు పాల్పడ్డారని, ఇది కోట్లాది మంది భక్తుల మనోభావాలను దెబ్బతీయడమేనని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలో టీటీడీని అపవిత్రం చేయడమే కాకుండా, లడ్డూ ప్రసాదం తయారీలో కల్తీ నెయ్యి వాడి మహా అపరాధానికి పాల్పడ్డారని విమర్శించారు. గత ఐదేళ్లలో ఒంగోలు జాతి పశువుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయిందని, ప్రస్తుతం రాష్ట్రంలో కేవలం వేల సంఖ్యలో మాత్రమే ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. టీటీడీ స్వయంగా గోశాలలను అభివృద్ధి చేసి, దేశవాళీ ఆవుల ద్వారా నెయ్యిని సేకరిస్తే భవిష్యత్తులో బయట వ్యక్తులపై ఆధారపడాల్సిన అవసరం ఉండదని సూచించారు. ఈ అంశాన్ని అసెంబ్లీలో ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని, అంతరించిపోతున్న ఒంగోలు జాతి గోవులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. దైవభక్తి, పాపభీతి లేని వైస్సార్సీపీ నాయకులు తక్షణమే శ్రీవారికి క్షమాపణ చెప్పాలని యార్లగడ్డ వెంకట్రావు డిమాండ్ చేశారు.



## వర్కింగ్ జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

**– మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ (దిలీప్)**

**– జమ్మికుంట ప్రెస్‌క్లబ్‌లో ఘనంగా నూతన మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్‌లకు ఘన సన్మానం**



జమ్మికుంట ఫిబ్రవరి 22 (వాయిస్ టుడే): జమ్మికుంట పట్టణంలోని ప్రెస్ క్లబ్ (టి డబ్ల్యూ జే ఎఫ్) కార్యాలయం లో నూతనంగా ఎన్నికైన మునిసిపాలిటీ చైర్మన్ ప్రశాంత్ కుమార్ (దిలీప్) మరియు వైస్ చైర్మన్ ముంతాజ్ అలీ (జావిద్) లకు నియోజకవర్గం అధ్యక్ష కార్యదర్శులు సౌడమల్ల యోహాన్, ఏబూసి సంపత్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం చేశారు . ఈ సందర్భంగా చైర్మన్ వైస్ చైర్మన్ లు మాట్లాడుతూ వర్కింగ్ జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం నా వంతు కృషి చేస్తాను, ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా పనిచేస్తున్న జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని అన్నారు. స్థానిక ప్రజలకు ఎలాంటి సమస్యలు ఎదురైన తమ దృష్టికి తీసుకురావాలని, స్థానిక ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ భూపతి సంతోష్, జిల్లా నాయకులు ఖాజా ఖాన్, టిడబ్ల్యూజేఎఫ్ నాయకులు కందుకూరి రాజు, అంబాల రాజు, బడుగు రవికుమార్, కొక్కుల శ్రీరామ్, రచ్చ రవి కృష్ణ, గుండా రాజేంద్రప్రసాద్ మరియు జర్నలిస్టులు ,ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## భీమేశ్వర స్వామి ఆలయంలో భక్తుల రద్దీ

**– 45,280 మంది దర్శనం, 2,906 కోడె మొక్కులు సమర్పణ**



వేములవాడ; ఫిబ్రవరి 22 (వాయిస్ టుడే): రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ లోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామి ఆలయం లో ఆదివారం ఉదయం నుంచి భక్తుల రద్దీ నెలకొంది. ఆలయానికి చేరుకున్న భక్తులు ముందుగా స్వామివారికి కోడె మొక్కులు చెల్లించి, అనంతరం అభిషేకాలు, అన్నపూజలు, ఆకుపూజలు, నిత్యకళ్యాణం, సత్యనారాయణ వ్రతం, కుంకుమ పూజలు తదితర ప్రత్యేక పూజలు నిర్వహించి తమ మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం భక్తులు స్వామివారిని భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. ఆదివారం ఉదయం నుంచి రాత్రి 7:30 గంటల వరకు మొత్తం 47,280 మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. అలాగే స్వామివారికి సమర్పించిన కోడిమొక్కుల సంఖ్య 2,906గా నమోదైంది. ఆలయానికి విచ్చేసిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ ఈవో శ్రీమతి ఎల్. రమాదేవి గారు స్వయంగా ఏర్పాట్లను పరిశీలించి, ఆలయ సిబ్బందికి తగిన సూచనలు అందించారు.



## ఐడిఏ ఇన్‌స్టాలేషన్ ప్రోగ్రామ్ విజయవంతం

సిరిసిల్ల ; ఫిబ్రవరి 22 (వాయిస్ టుడే): డాక్టర్ విజయ్ కుమార్ అధ్యక్షుడి గా, డాక్టర్ సతీష్ కుమార్ కార్యదర్శి గా, డాక్టర్ శ్యాంసుందర్ రెడ్డి కోశాధికారిగా నియమితులయ్యారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సుద్దాల అశోక్ తేజ హాజరయ్యి మాట్లాడుతూ. వైద్యులు అందించే గొప్ప సేవను ఆయన ప్రశంసించారు, వైద్య వృత్తిలో నైతికత, అంకితభావం, కరుణ యొక్క ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. రోగులకు చికిత్స చేయడంలో మాత్రమే కాకుండా సమాజాన్ని బలోపేతం చేయడంలో కూడా వైద్యులు కీలక పాత్ర పోషిస్తారని, సమాజ సంక్షేమం కోసం ఐడిఏ సేవా కార్యకలాపాలను ఆయన ప్రశంసించారు. ఆయన ఆలోచింపజేసే ప్రసంగం సభ్యులను ఎంతో ప్రేరేపించి గౌరవాన్ని జోడించింది. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాజు, డాక్టర్ శివరామకృష్ణ, డాక్టర్ గోపీకృష్ణ, డాక్టర్ రాజేందర్, డాక్టర్ పూర్ణ, డాక్టర్ నరేష్, డాక్టర్ సత్యన్వేష్, డాక్టర్ ఓం బ్రహ్మ, డాక్టర్ ప్రియాంక, డాక్టర్ ఆకాంక్ష, డాక్టర్ భవాని, డాక్టర్ శిల్ప, డాక్టర్ కీర్తి, డాక్టర్ లహరి, డాక్టర్ ప్రీతి, డాక్టర్ నికిత, డాక్టర్ మౌనిక పాల్గొన్నారు.

## యధావిధిగా ప్రజావాణి



నిర్మల్ జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 22 : నిర్మల్ కలెక్టరేట్ లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం ఈనెల 23వ తేదీ సోమవారం నుండి తిరిగి ప్రారంభమవుతుందని కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు మున్సిపల్ ఎన్నికల ప్రవర్తన నియమావళి ముగిసిన నేపథ్యంలో ప్రజావాణి కార్యక్రమాన్ని తిరిగి నిర్వహిస్తున్నట్లు వెలువడించారు జిల్లాలోని ప్రజలు తమ సమస్యలకు వినతులు ఫిర్యాదులు సమర్పించాల్సిన వారు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వాయిస్ టుడే
హైదరాబాద్
సోమవారం 23 ఫిబ్రవరి 2026



## బడంపేట రాచన్న స్వామి దేవస్థానం జాతరకు ప్రత్యేక బస్సులు

ఝరాసంగం (వాయిస్ టుడే): జహీరాబాద్ ఆర్టీసీ బస్టాండ్ నుంచి కోహీర్ మండలం బడంపేట గ్రామంలో నిర్వహించబడుతున్న రాచన్న స్వామి జాతరకు ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. భక్తుల ప్రయాణ సౌకర్యార్థం ఆదివారం ఉదయం ప్రత్యేక బస్సును ప్రారంభించారు. జాతర సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో హాజరవుతారని భావిస్తున్న నేపథ్యంలో ఈ ప్రత్యేక సర్వీసులను ఏర్పాటు చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. ప్రయాణికులు ఈ బస్సులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రయాణికుల రద్దీని అనుసరించి అవసరమైతే మరిన్ని రవాణా సౌకర్యాలను కల్పిస్తామని ఆర్టీసీ అధికారులు తెలిపారు.



## బుద్ధ వనం సందర్శించిన సౌత్ కొరియా ప్రతినిధులు

నాగార్జునసాగర్, ఫిబ్రవరి, 22: (వాయిస్ టుడే) : అంతర్జాతీయ ప్రమాణాలతో నాగార్జునసాగర్ లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్మించిన బుద్ధవనాన్ని ఆదివారము నాడు సౌత్ కొరియా బుద్ధిష్ట్ స్టడీస్ నేషనల్ యూనివర్సిటీ కి సంబంధించిన ప్రతినిధులు సందర్శించారు. హైదరాబాదులో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో పాల్గొన్న వీరు బుద్ధవనం ప్రత్యేక అధికారి మల్లేపల్లి లక్ష్మయ్య సూచన మేరకు ఆదివారం బుద్ధవనాన్ని సందర్శించారు. సౌత్ కొరియా నేషనల్ యూనివర్సిటీ కి చెందిన విద్యా సాంస్కృతిక ప్రతినిధుల బృందం కాంగ్ సుంగ్ యోంగ్,చోయ్ సేంగహో, మిన్ క్యేయోంగ్ వూ, కవన్ జిన్ వోక్, శేషు, చిరాగ్ జలది తదితరుల బుద్ధవనం సందర్శనలో భాగంగా బుద్ధుని పాదాల వద్ద పుష్పాంజలి ఘటించిన అనంతరం బుద్ధ చరిత వనం, జాతకవనం, ధ్యాన వనం, స్తూప స్తూపవనాలను సందర్శించారు. స్థూప వనములో నిర్మించినటువంటి సౌత్ కొరియా మహాస్తూపాన్ని సందర్శించి ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం మహా స్తూపం అంతర్భాగంలోని సమావేశ మందిరంలో బుద్ధవనం విశేషాలను తెలిపే లఘు చిత్రాన్ని వీక్షించారు. మహస్తూపంలోని ధ్యాన మందిరంలో బుద్ధవనం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శాసన, ఎస్టేట్ మేనేజర్ రవిచంద్ర,బుద్ధవనం ఆర్ట్స్ అండ్ ప్రమోషన్స్ మేనేజర్ శ్యాంసుందర్రావులు వీరిచే బుద్ధ జ్యోతులను వెలిగించి అనంతరం బుద్ధవనం కండువాలతో,బ్రోచర్లతో సత్కరించారు. బుద్ధ వనములో చేపట్టబోయే నూతన నిర్మాణాల గురించి వారికి తెలియజేశారు. వీరితోపాటు స్థానిక టూరిజం గైడ్ సత్యనారాయణ తదితరులు ఉన్నారు.



## వివాహ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మాణిక్ రావు, డిసిఎంఎస్ చైర్మన్ శివకుమార్

ఝరాసంగం(వాయిస్ టుడే): జహీరాబాద్ పట్టణంలో ఈరోజు జరిగిన పలు వివాహ వేడుకల్లో జహిరాబాద్.శాసనసభ్యులు కొనింటి మాణిక్ రావు . ఉమ్మడి మెదక్ జిల్లా డిసిఎంఎస్ చైర్మన్ శివకుమార్. పాల్గొన్నారు. నూతన వధూవరులను వారు ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు. ?అనంతరం, పోట్‌పల్లి గ్రామంలో జరిగిన నూతన గృహ ప్రవేశ కార్యక్రమంలో కూడా వారు పాల్గొని కుటుంబ సభ్యులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో. మాజీ.ఐ=ఖజజ మెంబర్ షేక్ ఫరీద్ , ఝరాసంగం మండల పార్టీ అధ్యక్షులు వెంకటేశం , మున్సిపల్ కౌన్సిలర్లు అన్నపూర్ణ అశోక్ శేరి , మహిపాల్ యాదవ్ , గౌస్ గౌరీ , బిఆర్ఎస్.పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మాజీ మంత్రివర్యులు డా. ఏ. చంద్రశేఖర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించిన జహీరాబాద్ మునిసిపల్ చైర్మన్ మహమ్మద్ యూనుస్



వాయిస్ టుడే ఝరాసంగం : జహీరాబాద్ నూతన మునిసిపల్ చైర్మన్ మహమ్మద్ యూనుస్. ఆదివారం. మాజీ మంత్రివర్యులు, జహీరాబాద్ ఇంచార్జ్ డా. ఏ. చంద్రశేఖర్ గారిని ఆయన నగరంలోని నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి సన్మానం చేశారు. ఇటీవల జరిగిన మునిసిపల్ ఎన్నికల్లో విజయం సాధించిన యూనుస్ గారికి మాజీ మంత్రి అభినందనలు తెలియజేశారు.ఈ సందర్భంలో ప్రాంత అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ పరస్పర చర్చలు జరిపినట్లు తెలిసింది. కార్యక్రమంలో కౌన్సిలర్ రంగా అరుణ్ కుమార్, కాంగ్రెస్ నాయకుడు శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# స్కౌట్స్ అండ్ గైడ్స్ ఉద్యమానికి సింగరేణి సంపూర్ణ సహకారం

భద్రాద్రి కొత్తగూడెం వాయిస్ టుడే ఫిబ్రవరి 22: "వరల్డ్ థింకింగ్ డే" సందర్భంగా జిఎం (పర్సనల్) వెల్ఫేర్, సిఎస్ఆర్ ఒ సెక్యూరిటీ జి.వి.కిరణ్ కుమార్ స్కౌట్స్ ఉద్యమ స్థాపకుడు బేడెన్ పవల్ జన్మదినాన్ని పురస్కరించుకొని భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్, సింగరేణి కాలరీస్ డిస్ట్రిక్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొత్తగూడెంలోని డిస్ట్రిక్ట్ హెడ్ క్వార్టర్స్ లో ఆదివారం నాడు "వరల్డ్ థింకింగ్ డే" కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి గా జిఎం (పర్సనల్) వెల్ఫేర్, సిఎస్ఆర్ ఒ సెక్యూరిటీ ఒ సింగరేణి కాలరీస్ డిస్ట్రిక్ట్ సెక్రటరీ జి.వి.కిరణ్ కుమార్ హాజరై భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ పతాకావిష్కరణ చేయడం జరిగింది. అనంతరం సర్వ సమ్మత ప్రార్థన నిర్వహించి బేడెన్ పవల్ విగ్రహానికి అతిథులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ సంవత్సరం స్కౌట్స్ ఉద్యమ స్థాపకుడు బేడెన్ పవల్ జన్మదినాన్ని పురస్కరించుకొని ఫిబ్రవరి 22 వ తారీఖున "వరల్డ్ థింకింగ్ డే" కార్యక్రమాన్ని సింగరేణి సంస్థ వ్యాప్తముగా అన్ని ఏరియా లలో ఘనముగా నిర్వహించుకుంటున్నామని అన్నారు. భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ నందు స్కౌట్స్ విధ్యార్థులకు దేశ భక్తి, నాయకత్వ లక్షణాలు మరియు విపత్తుల సమయం లో ధైర్యముగా ముందుకు వెళ్ళి సేవ చేసే విధముగా మొత్తంగా సంపూర్ణ వ్యక్తిత్వ వికాసం అలవరచుకునేలా స్కౌట్స్ అండ్ గైడ్స్ ఉద్యమం దోహద పడుతుందని, అందుకే యువత ను మరింతగా భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఉద్యమంలో భాగస్వామ్యం చేయాలని ఇందుకు సింగరేణి యాజమాన్యం ప్రత్యేక బడ్జెట్ ను కేటాయించి ప్రోత్సహిస్తుందని అన్నారు.

కులమతాలకు అతీతంగా సహజీవనాన్ని అలవరిచేదే స్కౌట్స్ అండ్ గైడ్స్ అని మనకు వచ్చే మంచి ఆలోచనలను ఆచరణలో పెట్టినప్పుడే మానవజన్మకు సార్ధకత లభిస్తుందని, ఈ ప్రపంచ ఆలోచనా దినోత్సవం రోజున స్కౌట్స్-గైడ్స్ ఈ దిశగా ప్రతిన బూనాలని అన్నారు. అదే విధముగా సమాజహిత కార్యక్రమాల నిర్వహణలో భాగంగా సింగరేణి రోవర్లు ఎన్నో సేవా కార్యక్రమాలలో పాల్గొన్నారని అన్నారు. అనంతరం "ప్రపంచ శాంతి" ని కాంక్షిస్తూ చిల్డ్రన్స్ పార్క్ నుండి రైల్వే స్టేషన్ వరకు నిర్వహించిన ర్యాలీ ని జిఎం (పర్సనల్) వెల్ఫేర్, సిఎస్ఆర్ ఒ సెక్యూరిటీ ఒ సింగరేణి కాలరీస్ డిస్ట్రిక్ట్ సెక్రటరీ జి.వి.కిరణ్ కుమార్ జెండాను ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన "అడ్వెంచర్ యాక్టివిటీస్" (సాహసోపేత కృత్యాలు), మంకీ క్రోల్, ఫీడింగ్ బాల్స్, రోప్ క్లైమ్బింగ్స్, టైర్ జంపింగ్ లలో స్కౌట్స్, గైడ్స్, కబ్స్, బుల్ బుల్స్ , రోవర్స్-రేంజర్స్, ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఉదయం నుండి సాయంత్రం వరకూ నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో జిఎం (పర్సనల్) వెల్ఫేర్, సిఎస్ఆర్ ఒ సెక్యూరిటీ ఒ సింగరేణి కాలరీస్ డిస్ట్రిక్ట్ సెక్రటరీ జి.వి.కిరణ్ కుమార్ తో పాటు డిజిఎం(పర్సనల్) బి.శివ కేశవ రావు, సీనియర్ పిఓ ఒ సింగరేణి కాలరీస్ డిస్ట్రిక్ట్ అసిస్టెంట్ కమిషనర్ ఎం.శ్రీనివాస్, వెల్ఫేర్ పిఏ కే.వరప్రసాద్, యూనిట్ లీడర్లు , సింగరేణి ఎయిడెడ్ పాఠశాల, శారదా విద్యాలయం,సెంట్ జేవియర్ పాఠశాల, సింగరేణి మహిళా జూనియర్ ఒ డిగ్రీ కళాశాలలకు చెందిన దాదాపు 145 మంది స్కౌట్స్ స్టూడెంట్స్ , వారి స్కౌట్ మాస్టర్స్, రోవర్ స్కౌట్ లీడర్స్ రోవర్సు విద్యార్థులు పాల్గొన్నారు.






## రజక కుటుంబంపై దాడి చేసి 2 నెలల చిన్నారిని బలి తీసుకున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలి

### మాజీ ఎంపీపీ గూడెపు శ్రీనివాస్

హుజూర్ నగర్ ఫిబ్రవరి22 (వాయిస్ టుడే ప్రతినిధి): హుజూర్ నగర్ నియోజకవర్గ కేంద్రంలో తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి జిల్లా అధ్యక్షులు గూడెపు నాగలింగం అధ్యక్షతన ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ ఎంపీపీ గూడెపు శ్రీనివాస్ మాట్లాడుతూ ... నాగర్ కర్నూల్ జిల్లా మండలం కుమ్మెర శ్రీమల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవంలో రజక కుటుంబంపై దాడి చేసి 2 నెలల చిన్నారిని బలిగొన్న ఉపేందర్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, ఉంధ్యాల శ్రీనివాసరెడ్డి, తుకారం రెడ్డి, సతీష్ రెడ్డి, కన్నిరెడ్డి లపై కేసు నమోదు చేసి వారికి కఠినంగా శిక్షించాలని హుజూర్ నగర్ మాజీ ఎంపీపీ గూడెపు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. చిలికేశ్వరం చంద్రకళ రజక కుటుంబం శ్రీమల్లికార్జున స్వామి దర్శనం చేసుకోవడానికి వెళ్లగా దర్శనం చేసుకోకుండా నిర్వాహకులు చంద్రకళ కుటుంబాన్ని అడ్డుకోగా ఎందుకు అడ్డుకుంటున్నారని ప్రశ్నించగా వారిపై బూతులు తిడుతూ దుర్భాషలాడుతూ అతికిరాతకంగా క్రూరంగా కొట్టి చిన్నారిని కాలుతో తన్ని చంపిన దుర్మార్గులను ఎందుకు పోలీసులు కేసు నమోదు చేయడం లేదని, బాధితులు ఫిర్యాదు చేయడానికి పోలీస్ స్టేషన్ కు వెళ్లగా పోలీసులు బాధితులనే బెదిరించి, పైగా బాధితుల మీదనే కేసులు బనాయించి, బాధితుల ఫిర్యాదును తీసుకోకుండా వెనక్కు పంపించిన పోలీసులు న్యాయం చేయకపోవడం అన్యాయమన్నారు. తక్షణమే బాధితులకు న్యాయం చేయాలని సంఘటనకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున నిరసనలు చేపడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం నాయకులు గూడెపు నాగలింగం దుగ్గి వర్మ రేపాకుల కోటయ్య గూడెపు నవీన్ ఉల్లెందుల వెంకటేశ్వర్లు, వడ్లానపు సత్యనారాయణ అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## జై గౌడ ఉద్యమం ఆధ్వర్యంలో నూతన మున్సిపల్ చైర్మన్ కౌన్సిలర్లకు ఘన సన్మానం



హుజూర్ నగర్ ఫిబ్రవరి 22 (వాయిస్ టుడే ప్రతినిధి): జై గౌడ ఉద్యమం ఆధ్వర్యంలో హుజూర్ నగర్ శ్రీ కంఠమహేశ్వర స్వామి సురమాంబ తల్లి దేవాలయం నందు నూతనంగా ఎన్నికైన హుజూర్ నగర్ మున్సిపల్ చైర్మన్ , కౌన్సిలర్లకు జై గౌడ ఉద్యమం జిల్లా అధ్యక్షులు కేశగాని నాగేశ్వరరావుగౌడ్ అధ్యక్షతన పాపన్న గౌడ్ ఫోటో మెమొంట్లను అందించి, పూలదండలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హుజూర్నగర్ మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్ గౌడ్, కౌన్సిలర్లు వల్లపుదాసు కృష్ణ గౌడ్, చేన్నగాని సైదులు గౌడ్, బెల్లంకొండ లలిత శ్రీనివాస్ గౌడ్, ఎరగని సుష్మా మురళి గౌడ్, పాల్గొన్నారు. మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ గౌడ్ కులస్తులు అన్ని రంగాల్లో రాణించాలని, ఐక్యంగా ఉంటేనే అన్ని సాధించగలం అని అన్నారు.అందరికీ అందుబాటులో ఉండి సహాయ సహకారాలు అందిస్తానని అన్నారు.ఈ కార్యక్రమంలో ఎక్స్ ఎంపీపీ నర్సింగ్ వెంకటేశ్వర్లు గౌడ్, బెల్లంకొండ చిరంజీవి గౌడ్ పెద్ద గౌడ్, ఎక్స్ జడ్పిటిసి పెండెం శ్రీనివాస్ గౌడ్, కీతవారిగూడెం సర్పంచ్ రామనాదం గౌడ్, జై గౌడ్ ఉద్యమ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కొప్పు రామకృష్ణ గౌడ్, నర్సింగ్ డాక్టర్ రంజిత్ గౌడ్, తుమ్మల సైదులు గౌడ్, పురుషోత్తం గౌడ్, కుక్కడపు సైదులు గౌడ్, సోమగాని భాస్కర్ గౌడ్ , ఆయిల లక్ష్మణ్ గౌడ్, తండు రమేష్ గౌడ్ ,సుబ్బు గౌడ్, చికూరి రామయ్య గౌడ్, కోటయ్య గౌడ్ ఐ ఎన్ టి యు సి బెల్లంకొండ గురవయ్య గౌడ్,ఆనంద్ గౌడ్, తండు వెంకన్న గౌడ్, జనిగల శ్రీనివాస్ గౌడ్, పుట్ట గోవింద గౌడ్ ,పుట్ట వెంకన్న గౌడ్, కుక్కడపు రామకృష్ణ గౌడ్, బెల్లంకొండ సైదులు గౌడ్, నర్సింగ్ సతీష్ గౌడ్, కేశగాని వీరయ్య గౌడ్, కారింగుల కాశీ గౌడ్, తదితరులు ఈ కార్యక్రమం పాల్గొన్నారు.

# ఘనంగా సాగర్ మాత దేవాలయంలో పతాకావిష్కరణ





### దేవాలయంలో పతాకావిష్కరణ కార్యక్రమంలో గురుశ్రీ డాక్టర్ పామిశెట్టి బాలస్వామి

నాగార్జునసాగర్ ఫిబ్రవరి 22 (వాయిస్ టుడే): విజయపురి సౌత్ లోని సాగరా మాత దేవాలయంలో ఆదివారం డోకిపర్రు యూనివర్సల్ కాలేజ్ కరస్పాండెంట్ గురుశ్రీ డాక్టర్ పామిశెట్టి బాలస్వామి చేతుల మీదుగా సాగర మాత పతాకావిష్కరణ ఘనంగా జరిగింది. ముందుగా ఆలయంలో నవదిన జపములు, దివ్యబలిపూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పూజా కార్యక్రమాల మధ్య పతాకాన్ని ఆవిష్కరించారు. తదుపరి ఆలయ ప్రాంగణంలో భక్తులు, విచారణ గురువులు స్తోత్ర గీతాలతో తేరు ప్రదక్షణ చేశారు. ఈ సందర్భంగా సాగరమాత గురుశ్రీ డాక్టర్ పామిశెట్టి బాలస్వామి మాట్లాడుతూ ఈ పుణ్యక్షేత్రంలో పండుగకు వచ్చే ప్రతి భక్తుడిని, విశ్వాసులను మీ వరములతో నింపి సంపూర్ణ ఆరోగ్యాలతో, సుఖ సంతోషాలతో శాంతి సమాధానాలతో వర్ధిల్లేలా చేయండని సాగర్ మాతను ప్రార్థించారు. మార్చ్ నెల 7 నుంచి 9వ తేది వరకు సాగర్ మాత మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 28 నుంచి వచ్చే నెల 6వ తేది వరకు ప్రతిరోజు ఉదయం 5.30 గంటల నుంచి నవదిన జపములు, దివ్యబలిపూజా కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు.

పామిశెట్టి బాలస్వామి మాట్లాడుతూ ఈ పుణ్యక్షేత్రంలో పండుగకు వచ్చే ప్రతి భక్తుడిని, విశ్వాసులను మీ వరములతో నింపి సంపూర్ణ ఆరోగ్యాలతో, సుఖ సంతోషాలతో శాంతి సమాధానాలతో వర్ధిల్లేలా చేయండని సాగర్మాతను ప్రార్థించారు. వచ్చే నెల 7 నుంచి 9వ తేది వరకు సాగర్ మాత మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 26 నుంచి వచ్చే నెల 6వ తేది వరకు ప్రతిరోజు ఉదయం 5.30 గంటల నుంచి నవదిన జపములు, దివ్యబలిపూజా కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సాగర్ మాత ఆలయ విచారణ గురువులు జోసఫ్ బాలసాగర్, గుంటూరు పునీత అంతోనివారి పుణ్యక్షేత్రం గురుశ్రీ అల్లం చిన్న శౌర్రెడ్డి, గుంటూరు డైరెక్టర్ కోల్సింగ్ యూత్ సెంటర్ గురుశ్రీ తుమ్మా కరుణాకర్రెడ్డి, ఆలయ పెద్దలు దుగ్గెంపూడి ఇన్నారెడ్డి, జక్కిరెడ్డి చిన్నపరెడ్డి, శౌరిరాజు, ఆలేటి మరియదాసు, శౌరిబాబు, కట్టారాజు, చందు తదితరులు పాల్గొన్నారు.



# సమస్యల పరిష్కారానికే "మన వాడకు మన నాయిని"

**రెండేళ్ల ప్రగతి ఒకవైపు.. భవిష్యత్ అభివృద్ధి మరో వైపు**

**సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకొని వెంటనే పరిష్కార దిశగా అడుగులు..**

**కాజీపేట 47వ డివిజన్‌లో ఎమ్మెల్యే నాయిని పర్యటన..**



కాజీపేట,వాయిస్ టుడే: ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వేగంగా పరిష్కరించడమే లక్ష్యంగా 'మన వాడకు మన నాయిని' కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి తెలిపారు. ప్రజా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తి చేసుకున్న నేపథ్యంలో ఈ రెండు సంవత్సరాల్లో సాధించిన అభివృద్ధిని ప్రజలకు వివరించడంతో పాటు రానున్న కాలంలో చేపట్టబోయే అభివృద్ధి కార్యక్రమాలపై కార్యాచరణ రూపొందించేందుకు ఈ కార్యక్రమం అని ఎమ్మెల్యే నాయిని అన్నారు. ఆదివారం కాజీపేట 47వ డివిజన్‌లో బల్దియా మేయర్ గుండు సుధారాణి,మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ లతో కలిసి విస్తృత పర్యటన నిర్వహించారు. పలు కాలనీలలో పర్యటిస్తూ ప్రజలతో మమేకమై వారి సమస్యలను ప్రత్యక్షంగా అడిగి తెలుసుకున్నారు.

కాజీపేట 47వ డివిజన్ బూడిదగడ్డ,జూజా లోకో షెడ్ ప్రాంతాన్ని ఎమ్మెల్యే మొదట పరిశీలించారు. పైభాగం నుంచి వచ్చే నీరు డ్రైనేజీ సౌకర్యం సరిగా లేక కిందికి వెళ్లడంలో ఇబ్బందులు ఏర్పడుతున్నాయని గుర్తించారు. డ్రైనేజీ వెడల్పు పెంపుతో పాటు కొత్త డ్రైనేజీ నిర్మాణానికి రైల్వే శాఖ అధికారులతో సమన్వయం చేసి అంచనాలు సిద్ధం చేయాలని సూచించారు. అనంతరం కడిపికొండ రైల్వే బ్రిడ్జి రోడ్డు మరమ్మత్తులు,సమీప చెరువును పరిశీలించారు. బోడగుట్టలో నిర్మాణం పూర్తి చేసిన ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించి లబ్ధిదారులకు అందజేశారు. బోడగుట్ట చెరువు పరిసర ప్రాంతాల్లో అంతర్గత రోడ్ల పరిస్థితిని పరిశీలించి తక్షణమే అంచనాలు తయారు చేసి పనులు ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే ఇంపీరియల్ కాలనీలో అంతర్గత రోడ్ల నిర్మాణం,సైడ్ డ్రైనేజీ పనులను త్వరితగతిన చేపట్టాలని సూచించారు. ప్రజలకు మౌలిక సదుపాయాలు అందించడంలో ఎటువంటి ఆలస్యం సహించబోమని స్పష్టం చేశారు. ఇంపీరియల్ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో డివిజన్‌కు చెందిన బూత్ కమిటీ సభ్యులు,ఏజెంట్లతో సమావేశమై ప్రభుత్వ పథకాల అమలు,ప్రజలతో భాగస్వామ్యం పెంపు,అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల మధ్యకు వెళ్లి వారి సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకోవడం వెంటనే పరిష్కార దిశగా అడుగులు వేయడం మా బాధ్యత అని తెలిపారు. రెండేళ్లలో చేసిన అభివృద్ధి పనులు ఒకవైపు ఉంటే రానున్న రోజుల్లో ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగడం మరో వైపు అన్నారు. 26 డివిజన్‌లలో ఈ కార్యక్రమం నిర్వహించి ప్రతి ప్రాంత అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని పేర్కొన్నారు. పర్యటనలో తన దృష్టికి వచ్చిన ప్రతి సమస్యపై పత్రాలు స్వీకరించి సంబంధిత అధికారులతో సమన్వయం చేసి వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు విజయ శ్రీ రజాలీ, తోట వెంకన్న,టిపిసిసి ప్రధాన కార్యదర్శి ఇ.వి.శ్రీనివాస్, నాయకులు అజ్గర్, శ్రీకాంత్, సిరిల్, రాజ్ కుమార్, బబ్లు, భరత్,కాజీపేట తహశీల్దార్ రాజు,కాజీపేట మున్సిపల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్, స్థానిక ప్రజా ప్రతినిధులు,పార్టీ నాయకులు, అధికారులు మరియు ప్రజలు పాల్గొన్నారు.

## సహకార సంఘాల ద్వారానే రైతులకు యూరియా సరఫరా చేయాలి

**సిపిఎం పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు నాగారపు పాండు**



హుజూర్ నగర్ ఫిబ్రవరి 22 (వాయిస్ టుడే ప్రతినిధి) : యూరియా కొరత నివారించి అవసరం ఉన్న ప్రతి రైతుకు సహకార సంఘాల ద్వారానే యూరియా అందజేయాలని యాప్ విధానం రద్దు చేయాలని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నాగారపు పాండు డిమాండ్ చేశారు ఆదివారం హుజూర్నగర్ మండల కేంద్రంలో అమరవీరుల స్మారక భవనంలో నిర్వహించిన మండల కమిటీ సమావేశానికి హాజరై మాట్లాడుతూ రైతులకు డిమాండ్ మేరకు యూరియా స్థానిక సహకార సంఘాల ద్వారా అర్హులందరికీ పంపిణీ చేయాలని యాప్ పద్ధతి వల్ల రైతులు ఉన్న దగ్గర కాకుండా దూర ప్రాంతాలలోకి వెళ్లి తీసుకోవడం రైతులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు కేంద్ర ప్రభుత్వం 2005లో వామపక్షాల పార్టీల ఒత్తిడి మేరకు వచ్చిన పని గ్యారంటీ చట్టం ప్రకారం ప్రతి గ్రామంలో జాబు కార్డులు ఉన్న ప్రతికూలికి 100 రోజులు పని విధానం ఎత్తివేసి ఈ బి జి రామ్ జి పేరుతో ఈ పథకం అమలు చేయాలని మోడీ ప్రభుత్వం కుట్రలు చేస్తుందన్నారు రైతులను దివాలా తీసే విత్తన చట్టం విద్యుత్ సవరణ చట్టం తెచ్చి రైతులను ప్రవేట్ కార్పొరేట్ కంపెనీలకు మేలు చేయాలని ప్రభుత్వం కుట్రలు చేస్తూ చట్టాలు తెస్తున్నారని విమర్శించారు అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని ఆరు గ్యారెంటీ పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు ఈ సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు దుగ్గి. బ్రహ్మం మండల కార్యదర్శి పోసనబోయిన. హుస్సేన్ మండల కమిటీ సభ్యులు తంగల. వెంకట చంద్ర నూకల. లక్ష్మీనరసమ్మ షేక్ .సైదా మాదూరి. నరసింహ చారి నెట్టి .వెంకటేశ్వర్లు మీగడ. రాములు సికూరి. తిరపయ్య చందాల. బిక్షం వెల్లం శెట్టి. వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.





## వేములవాడ నిత్యాన్నదాన సత్రం నూతన గదుల నిర్మాణానికి రూ.1.50 లక్షల చొప్పున విరాళాలు

వేములవాడ :వాయిస్ టుడే : వేములవాడ లోని శ్రీ రాజ రాజేశ్వరి మున్నూరు కాపు (కాపు) నిత్యాన్నదాన సత్రంలో నూతన గదుల నిర్మాణానికి ఉదార విరాళాలు అందాయి. హైదరాబాద్‌కు చెందిన చిక్కడపల్లి నివాసులు చిరంజీవి సదానంద్ -- సుజాత దంపతులు, అలాగే ఈస్ట్ మారేడుపల్లి నివాసులు బిట్ల దిలీప్ కుమార్ -- భవానీ దంపతులు తమ కుమార్తె వైష్ణవితో కలిసి చెరో రూ.1,50,000 చొప్పున విరాళంగా అందజేశారు. ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఈ విరాళాలు సత్రం ప్రతినిధులకు అందజేయగా, ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న గదుల పనులకు తమ వంతు సహకారం అందించినందుకు వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా సత్రం వ్యవస్థాపకులు డా. కొండా దేవయ్య పటేల్ మాట్లాడుతూ, దాతల కుటుంబాలకు శ్రీ రాజ రాజేశ్వర స్వామి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సత్రం మేనేజర్ తిరుపతి కద్రు, డైరెక్టర్ రమేష్ పటేల్ వంగల తదితరులు పాల్గొని దాతలను శుభాభినందనలు తెలుపుతూ సత్కరించారు.

## రాష్ట్ర అభివృద్ధే లక్ష్యంగా బీఆర్ఎస్ నిరంతరం పనిచేస్తోంది

**పరకాల నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి**

**బీఆర్ఎస్‌లో చేరిన పలువురు బీజేపీ నాయకులు**



హనుమకొండ జిల్లా,వాయిస్ టుడే: ప్రజల సంక్షేమం మరియు రాష్ట్ర అభివృద్ధే లక్ష్యంగా బీఆర్ఎస్ నిరంతరం పనిచేస్తోందని పరకాల మాజీ శాసనసభ్యులు చల్లా ధర్మారెడ్డి తెలిపారు. ఆదివారం దామెర మండలం దుర్గంపేట గ్రామానికి చెందిన బీజేపీ సీనియర్ నాయకులు పొడల కుమారస్వామి ఆ పార్టీకి రాజీనామా చేసి పరకాల మాజీ శాసనసభ్యులు చల్లా ధర్మారెడ్డి ఆధ్వర్యంలో భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పార్టీలో చేరారు. ఈ సందర్భంగా చల్లా ధర్మారెడ్డి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బిజెపి నాయకుల చేరికతో దుర్గంపేట గ్రామంలో బీఆర్ఎస్ మరింత బలపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక బిఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలు,యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


## వైకాపాలో చేరుతున్నామన్నది అసత్య ప్రచారమే

**వంగవీటి కుమార్తె ఆశాలత**



కంభం: తాము వైకాపాలో చేరుతున్నట్లుగా సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న ప్రచారంలో నిజం లేదని మాజీ ఎమ్మెల్యే వంగవీటి మోహనరంగా కుమార్తె ఆశాలత స్పష్టం చేశారు. మార్కాపురం జిల్లాలోని చారిత్రక కంభం చెరువును ఆదివారం ఆమె సందర్శించి, విలేకర్లతో మాట్లాడారు. కొందరు కావాలనే పనిగట్టుకుని వైకాపాలో చేరికపై అసత్య ప్రచారం చేస్తున్నారని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రాధా, రంగా మిత్రమండలిని ఏకతాటిపైకి తెచ్చి బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. రాజకీయాల్లోకి వచ్చేందుకు సమయం ఉందని, ఏ నిర్ణయమైనా అభిమానుల అభిప్రాయం మేరకే ఉంటుందని ఆమె స్పష్టం చేశారు.

## వైభవంగా శ్రీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు



తొర్రూరు , ఫిబ్రవరి 22 వాయిస్ టుడే : తొర్రూరు డివిజన్ కేంద్రంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో24 వ వార్షిక బ్రహ్మోత్సవాలు వికాస తరంగిణి శాఖ, ఆలయ నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో మూడు రోజులపాటు ఘనంగా నిర్వహించారు శనివారం రాత్రి స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని కన్నుల పండుగగా ఆగమ శాస్త్రానుసారం వేదమంత్రోచ్ఛారణల నడుమ స్థానాచార్యులు ఓలేటి యాదగిరా చార్యులు, ఆలయ అర్చకులు ఆరుట్ల శ్రీకాంతాచార్యులు , ఓలేటి గీత చార్యులు , అంగరంగ వైభవోపేతంగా చేశారు. ఈ కళ్యాణ వేడుకలో వారు విశ్వక్సేన ఆరాధన, ప్రవర పుణ్యాహవాచనం, పాదప్రక్షాళన, మధుపర్కం యజ్ఞోపవిత ధారణ, జీలకర్ర బెల్లం, మాంగళ్యసూత్ర ధారణ, తలంబ్రాలు, మాల సమర్పణ పూజా కార్యక్రమాలు కనుల పండుగగా నిర్వహించారునిర్వహించారు. భక్తులు ప్రజలు సుభిక్షంగా శాంతి సౌభాగ్యాలతో వర్ధిల్లాలని స్వామివారిని అర్చకులు కోరారు. ఆదివారం రోజున మహా పూర్ణాహుతి, బలిహరణం, నవ కలశ స్నపనం చక్రతీర్థం, సాయంత్రం విష్ణు సహస్రనామ పారాయణం, మహా పుష్పయాగం, ద్వాదశ ఆరాధనలు, ద్వాదశ ప్రదక్షిణలు, తీర్థ ప్రసాద వినియోగము పండిత ఆరాధన కార్యక్రమాలను దనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకులు డాక్టర్ కుందూరు గీతా రాజేందర్ రెడ్డి, తమ్మెర లక్ష్మీనరసింహారావు, డాక్టర్ కిరణ్ కుమార్, కొత్త యాదగిరి రెడ్డి, లయన్ వెంకట్ రెడ్డి, మల్యాల వెంకటేశ్వరరావు తమ్మి ఉపేందర్ ,మోహన్ రెడ్డి, నాళ్ళ కృష్ణమూర్తి, చలువాది సత్యనారాయణ తమ్మెర వీరభద్రరావు, ఇమ్మడి రాంబాబు బోనగిరి శంకర్, కోనే ప్రభాకర్ , చలువాది సత్యనారాయణ, కుందూరు గీతా రెడ్డి, ప్రసూన, అనుపమ విజయలక్ష్మి రేణుక, శోభ ,ఇందిర,ఆలయ కమిటీ సభ్యులు, వికాస తరంగిణి సభ్యులు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

Printed by Published by : **Kotha Laxman** on behalf of Kotha Laxman, printed at and published at 10-5-336/2-1, Kishan Nagar, **Editor: Kotha Laxman.**